అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
మంగళవారం 25 ఏప్రిల్ 2023

కుటుంబానికి అండగా ఉంటా


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఇమ్మడి గోపి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇంటికి పెద్ద దిక్కుకోల్పోయి ఇంకోపక్క పేదరికంతో అల్లాడుతున్న ఆ కుటుంబానికి నేను ఉన్నానని ధర్పల్లి మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపి, సర్పంచ్ ఇమ్మడి లక్ష్మి గోపి తన వంతుగా 10వేల రూపాయలు అంత్యక్రియల కోసం అందజేసి ఉదారతను చాటుకున్నారు ఇందల్ వాయి మండలంలోని గౌరరం గ్రామంలో సంపంగి నర్సయ్య (ఒడ్డెర) అనారోగ్యంతో బాధపడుతు ఆదివారం రాత్రి మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపి కు వివరించారు.వెంటనే ఆర్థికసాయం అందజేశారు.

టీకాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

నవతెలంగాణ-ఎడపల్లి

ఇమ్యు నిజెషన్ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని దుబ్బ తండా గ్రామంచాయతీలో గర్భిణిలకు, చిన్నారులకు, టీకాల ప్రాముకుత్పై అవగాహన కల్పించినట్లు మండల కంటి వెలుగు ఇంచార్జి వైద్య ఆరోగ్య శాఖాధికారి రాజ్ కుమార్ తెలిపారు. సంవత్సరంలోపు పిల్లలకు టీకాలు ఇప్పించాలని, గర్భిణులకు రెండు టీకాలు తప్ప కుండ వేసుకోవాలని తెలిపారు. కార్య క్రమంలో మాధవి లత, ఆశా వర్కర్ల రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రాజమణి, గంగామని, అనసూయ, అబ్బవ్వ, తది తరులు పాల్గొన్నారు.

'చూచిరాత'కు సర్వంసిద్ధం

- నేటి నుంచి ఓపెన్ ఎస్ఎస్‌సీ, ఇంటర్ పరీక్షలు
- అభ్యర్థుల నుంచి డబ్బులు దండుకుంటున్నట్టు ఆరోపణలు



నవతెలంగాణ-బోధన్

చదువు మధ్యలో మానేసి నిరుద్యోగులుగా ఉన్న యువతి, యువకులు ఉన్నత చదువులు చదువుకోడానికి ప్రభుత్వం సార్వత్రిక విద్యావిధానంలో భాగంగా ఓపెన్ ఎస్ఎస్సి, ఇంటర్ పూర్తిచేసేందుకు అవకాశం కల్పిస్తుంది. కొంతమంది వారి పాస్ పోర్టుల కోసం లేదా ఇతర అవసరాల కోసం పదవ తరగతి అర్హత తప్పనిసరి కావడంతో ఓపెన్ స్కూల్ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. దాంతో ఓపెన్ స్కూల్ ద్వారా వారు మధ్యలో మానేసిన చదువును పూర్తి చేయడానికి ముందుకు వస్తున్నారు. నిరుద్యోగుల అవసరాన్ని అవకాశంగా భావించిన ఓపెన్ స్కూల్ నిర్వాహకులు అభ్యర్థుల వద్ద అందినకాడికి వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అడ్మిషన్‌లు చేసినప్పుడు సైతం అసలు ఫీజు కంటే రెట్టింపు ఫీజు వసూలు చేసిన ఘటనలు ఉన్నట్లు సమాచారం. నిరుద్యోగులు తప్పని పరిస్థితుల్లో ఎస్ఎస్సి చదవాలని భావించడంతో నిర్వాహకులకు అడిగినంత డబ్బులు చెల్లించి ఫీజులు చెల్లిస్తున్నారు. దాంతో ఓపెన్ స్కూల్ నిర్వాహకులు చేస్తున్న వసూళ్లకు అడ్డూ అదుపు లేకుండా పోయిందని బహిరంగంగానే విమర్శలు వస్తున్నాయి. చివరికి ఎస్ఎస్సి హాల్ టికెట్లు సైతం ఇవ్వడానికి డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఏప్రిల్ 25వ తేదీ నుండి నిర్వహించే ఓపెన్ ఎస్ఎస్సి ఇంటర్ పరీక్షలకు బోధనలో 4 కేంద్రాలలో నిర్వహిస్తున్నారు. ఓపెన్ ఎస్ఎస్సి పరీక్షకు రెండు కేంద్రాలలో 120 మంది అభ్యర్థులు పరీక్షలు రాస్తున్నట్లు చీఫ్ సూపరింటెండెట్ రాములు తెలిపారు. ఓపెన్ టెన్త్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరగడానికి సర్వం సిద్ధం చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రైతులకు నష్టం కలగకుండా చూస్తాం

- డీసీవో సింహాచలం


మాట్లాడుతున్న డీసీవో సింహాచలం

నవతెలంగాణ-మోర్తాడ్

మండల కేంద్రంలోని సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా వరి ధాన్యం కొనుగోలు చేస్తామని డిసిఓ సింహాచలం అన్నారు. సహకార సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న కొనుగోలు కేంద్రాలలో రైతులకు మోసాలు జరుగుతున్నాయి అంటూ స్థానిక రైతులు చేపడుతున్న ఆందోళన విషయం తెలుసుకున్న జిల్లా ఉన్నతాధికారులు సహకార సంఘానికి వచ్చి రైతులతో చర్చించారు. నియమాల లోబడి రైతుల ధాన్యాన్ని తప్పనిసరిగా కొనుగోలు చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. రైతు ధాన్యం విక్రయాలలో అక్రమాలపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళనను విరమించారు. గత నాలుగు సంవత్సరాల సంబంధించిన వరి కొనుగోల బేబీలులను అధికారులకు సమర్పించాలని సహకార సంఘ సిబ్బందికి సూచించారు. తరుగు పేరుతో అధిక తూకం వేయకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఓ చంద్రశేఖర్, తాసిల్దార్ బావయ్య, ఏవో లావణ్య పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనరా..?

మక్కలకు మద్దతు ధర కరువు

- దిగుబడి వచ్చినా.. ధర లేక పెట్టుబడులు రావేమోనని రైతుల ఆందోళన
- ఆదుకోవాలని కోరుతున్న రైతులు


మొక్కజొన్నను ఎండబెడుతున్న రైతులు


టార్పాలిన్ కవర్‌లు కప్పుతూ కాపాడుదుకుంటూ..

నవతెలంగాణ-నసురుల్లాబాద్

మొక్కజొన్న పంటకు మద్దతు ధర లేక రైతులు తీవ్ర నష్టాల పాలవుతున్నారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మక్కలను కొనుగోలు చేయాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు ఆవేదనకు గురవుతున్నారు. బాన్సువాడ డివిజన్ లోని బాన్సువాడ, బీర్కూర్, నసురుల్లాబాద్, మండలాల్లో 5132 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. అత్యధికంగా నసురుల్లాబాద్, బాన్సువాడ, బీర్కూర్ తదితర మండలాల్లో మొక్కజొన్న సాగు చేశారు. ఈ సీజన్‌లో ఎకరానికి 25 నుంచి 30 క్వింటాళ్ల వరకు మంచి దిగుబడులు వచ్చిన, పంటను కొనేవారు లేకపోవడంతో ప్రైవేటు వ్యక్తులు వారికి ఇష్టం వచ్చిన ధరలతో కొనుగోలు చేస్తు న్నట్లు రైతులు వాపోతున్నారు.

మద్దతు ధర కరువు..

ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం క్వింటాలుకు 1,962 రూపాయలు ఉండగా, వ్యాపారులు క్వింటాలుకు 1,500 రూపాయలకు మించి కొనుగోలు చేయడం లేదని రైతులు తెలిపారు. అసలు పంటను కొనుగోలు చేసేందుకే ముందుకు రావడం లేదని చెబుతున్నారు. గత సంవత్సరం రైతులు సాగు చేసిన మక్కలను ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసింది. ఇక్కడి రైతులకు బాన్సువాడ వ్యవసాయ అధికారులు టోకెన్ రాసి ఇవ్వడంతో ఇక్కడి రైతులు మొక్కజొన్నలను తీసుకెళ్లి మద్దతు ధరకు విక్రయించుకున్నారు.

కేవలం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేస్తుంది. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఊసెత్తడం లేదు. గడిచిన వానాకాలం సాగుకు ముందు నియంత్రిత పద్ధతిలో పంటలను సాగు చేయాలని, మొక్కజొన్న పంటకు డిమాండ్ లేదని, ఆ పంటను సాగు చేస్తే రైతుబంధు వేయమని, పంటను కొనుగోలు చేయమని సీఎం కేసీఆర్ ప్రకటించారు. దీంతో చాలామంది రైతులు మొక్కజొన్నకు బదులు ఇతర పంటలను సాగు చేశారు. వరి సాగులో సన్నరకాల సాగును పెంచాలని చెప్పడంతో, ఆ పంటకు ఎలాంటి బోనస్ ఇవ్వకపోగా, ఆ పంటను సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. మక్కలు వద్దని చెప్పి సీఎం అక్కడక్కడా సాగు చేసిన రైతుల నుంచి మక్కలను కొనుగోలు చేశారు. కానీ డివిజన్ పరిధిలో ఎక్కడ కొనుగోలు చెయ్యలేదు.

ఈ యాసంగిలో నియంత్రిత సాగు గురించి ప్రభుత్వం గానీ, వ్యవసాయ శాఖాధికారులు గానీ ఎలాంటి ఆంక్షలను విధించలేదు. దీంతో కొందరు రైతులు నీటి వసతి తక్కువగా ఉన్న ప్రాంతాల్లో వరికి బదులు మొక్కజొన్న పంటను సాగు చేశారు. పంట దిగుబడి మంచిగా వచ్చినా పంటను కొనుగోలు చేసేవారు లేక రోడ్లపై రాశు లు వేసి ఉంచారు. వాతావరణంలో మార్పులు రావడంతో రైతులు ఆందోళనలు చెందుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులకు కోరుతున్నారు.

మొక్కజొన్న కొనేవారు లేరు

ధరావత్ రవీందర్ కట్టకింద తండా



ఈ యసంగిలో లో పంటలు వేసిన రైతులకు పెట్టుబడులు విపరీతంగా పెరిగాయి. కానీ దిగుబడులు ఆశించిన మేరకు రాలేదు. పెట్టిన పెట్టుబడులకు సరిపోయేలా లేవు. కూలీ రేట్లతో పెట్టుబడి ధరలు పెరిగాయి. మూడు ఎకరాల్లో మొక్క పంట సాగుచేసిన. మొక్కజొన్న కొనేవారు లేక ఇబ్బందిగా మారింది. గత రెండు రోజుల నుంచి అకాల వర్షం కురవడంతో దళారులు ధరలు తగ్గించారు. అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి.

గిట్టుబాటు ధర లేద

సూర్యనారాయణ. రైతు, హాజీపూర్.



హాజీపూర్ శివారులో ఏడెకరాల మొక్కజొన్న పంట సాగుచేసిన. మూడున్నర లక్షల పెట్టుబడి పెట్టిన. 200 బస్తాల మొక్కజొన్న పంట దిగుబడి వచ్చినా కొనుగోలు చేసేవారు లేరు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తే కొంత గిట్టుబాటు అవుతుంది. అకాల వర్షాలు, వాతావరణ మార్పులతో ప్రయివేటు వారు 1500 నుంచి 1600కే కొనుగోలు చేస్తున్నారు. దీంతో పెట్టిన పెట్టుబడి రాక నష్టాలపాలవుతున్నాం.

ధాన్యం కొనుగోలు కేంద్రాలలో టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలి

- అధికారులకు కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఆదేశం

నవతెలంగాణ-కామారెడ్డి

ధాన్యం కొనుగోలు కేంద్రాలలో టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఆయన సహకార సంఘాల, ఐకెపి అధికారులతో ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఏర్పాటు చేసిన సౌకర్యాలపై టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ధాన్యం తడవకుండా చూడవలసిన బాధ్యత అధికారులపై ఉందని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద నీడ సౌకర్యం (టెంట్) కల్పించాలని చెప్పారు. కేంద్రాల వద్ద కు శుభ్రమైన దాన్యం తీసుకువచ్చే విధంగా అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ట్యాబులో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని పేర్కొన్నారు. సొసైటీ పర్యవేక్షణ అధికారులు కేంద్రాలను నిత్యం పర్యవేక్షణ చేయాలని తెలిపారు. ఇప్పటికి జిల్లాలో సహకార సంఘాల ద్వారా 120 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు చెప్పారు. 200 కొనుగోలు కేంద్రాలు త్వరలో ప్రారంభిస్తామని పేర్కొన్నారు. టెలికాన్ఫరెన్సులో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, జిల్లా సహకార అధికారిని వసంత, డిఎస్ఓ పద్మ, ఐకెపిడీపీఎం రమేష్ బాబు, అధికారులు పాల్గొన్నారు.

కాలం చెల్లిన కల్యాణలక్ష్మి చెక్కులు

- 72 చెక్కులు వెనక్కు
- పంపిణీకి ప్రజాప్రతినిధులకు దొరకని సమయం..?



నవతెలంగాణ-మోపాల్

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేదింటి ఆడబిడ్డలకు వరం అంటూ ఊదరగొట్టే పాలకులు.. సకాలంలో లబ్దిదారుల చేతికి చెక్కులు అందజేయ కపోవడంతో వాటి కాలం చెల్లిపోయింది. మోపాల్ మండలం వ్యాప్తంగా 72 చెక్కుల గడువు తేదీ ముగియడంతో వెనక్కు వెళ్లిపోయాయి. చెక్కులు వస్తాయని ఆశతో ఎదురుచూస్తున్న లబ్దిదారులకు ఎదురుచూపులు తప్పడం లేదు. దేవుడు వరమిచ్చినా పూజారి కనుకరించలేదనే చందంగా ప్రభుత్వం చెక్కులు మంజూరు చేసిన ప్రజాప్రతి నిధుల తీరుతో చెక్కులు వాపస్ పోయాయని లబ్దిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పేదింటి ఆడబిడ్డల పెండ్లి ఆ కుటుంబానికి ఆర్థిక భారం కావొద్దనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను అమలు చేస్తుంది. ఈ పథకం కింద పెండ్లి చేసిన ఆడబిడ్డ కుటుంబానికి ప్రభుత్వం రూ. 1,00,116 అందజేస్తుంది. పెండ్లి అయిన అనంతరం దరఖాస్తు చేసుకున్న వారికి వివరాలు ఆరా తీసి చెక్కులు సిద్ధం చేయించి ప్రజాప్రతినిధు లతో కలిసి పంపిణీ చేస్తుంది. దీంతో నిరుపేద కుటుంబాలకు ఈ పథకం కొండంత భరోసా కల్పిస్తుంది. ఈ పథకం కింద డబ్బులు వస్తాయనే దీమాతో అప్పులు చేసి మరీ పెండ్లి చేసి చెక్కులు రాగానే తీర్చుకుంటున్నారు.

చెక్కులు పంపిణీ చేయకపోవడంతో ముగిసిన తేదీ

ప్రభుత్వం అందజేసే చెక్కులపై ముద్రించిన తేదీ నుంచి మూడు నెలల వరకు గడువు ఉంటుంది. ఆ గడువులోగా లబ్దిదారులకు చెక్కులు అందితే వారి బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అయ్యే అవకాశం ఉంటుంది. అయితే మోపాల్ మండలంలో చెక్కుల పంపిణీ చేయకపోడంతో సుమారు 72 చెక్కుల గడువు తేదీ ముగిసినట్లు సమాచారం. దీంతో వాటిని వెనక్కు తిప్పి పంపారు. ఇప్పటికే చెక్కులు వస్తలేవని పలువురు ఎదురుచూస్తున్న తరుణంలో వచ్చిన చెక్కులు పంపిణీ చేయకపోవడంతో లబ్దిదారులు ఆవేదనకు గురవుతున్నారు. ప్రజాప్రతి నిధులకు చెక్కులు పంపిణీ చేసేందుకు సమయం దొరకడం లేదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి గడువు దగ్గరలో ఉన్న చెక్కులనైనా సకాలంలో లబ్దిదారులకు అందజేయా లని కోరుతున్నారు. అప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని స్థానికులు పేర్కొంటున్నారు.

భూమి లాక్కుండు.. బువ్వ పెడుతలే

- కొడుకుపై కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసిన వృద్ధురాలు


కలెక్టరేట్‌కు వచ్చిన వృద్ధురాలు

నవతెలంగాణ-కామారెడ్డి(తాడ్వాయి)

రెక్కలాడని వయస్సులో కొడుకు అండగా నిలబడతాడని అనుకుంటే ఉన్న భూమిని లాక్కొని కనీసం బువ్వ పెట్టడం లేదని ఓ తల్లి వాపోయింది. తనకు తెలియకుండా భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకొని మోసం చేసి తన కొడుకుపై చర్యలు తీసుకొని తనను పోషిం చేబాధ్యత తీసుకునే విధంగా చూడాలని కోరుతూ సోమవారం కామారెడ్డి కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో ఫిర్యాదు చేసింది. వివరాల్లోకి వెళ్తే.. మద్నూర్ మండలం మారేపల్లి గ్రామానికి చెందిన మట్‌వాలే రత్నమ్మ -భద్రయ్య దంపతులకు ఒక కుమారుడు, ఇద్దరు కూతుళ్లు సంతానం. వీరికి గ్రామంలోని సర్వేనెంబర్ 101 లో 13.29 ఎకరాల భూమి భర్త భద్రప్ప పేరిట కలిగి ఉన్నది. రత్నమ్మ ఇద్దరు కూతుళ్లకు వివాహం జరిపించింది. 2017 సంవత్సరంలో భద్రప్ప అనారోగ్యంతో మృతిచెందాడు. కొడుకు శంకర్ గత కొద్ది సంవత్సరాలుగా వృద్ధురాలైన తల్లిని పోషించకుండా ఆమె పేరు మీద ఉన్న భూమిని 2017లోనే తల్లికి తెలియకుండా ఆయన పేరుపై రిజిస్ట్రేషన్ చేయిం చుకున్నాడని ఫిర్యాదు చేసింది. ఉన్న భూమిని లాక్కొని సైతం తనను పోషించ డం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. కొడుకు పోషించకపోవడంతో గత కొద్ది సంవత్సరాలుగా వృద్ధురాలు రత్నమ్మ తన కూతుర్ల వద్ద ఉంటూ జీవిస్తుంది. భూమి తన పేరు మీద రిజిస్ట్రేషన్ చేసి, తనను పోషించాలని వేడుకుంది.

మహిళల హక్కుల పరిరక్షణే ధ్యేయం

- మహిళల భద్రతా చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి
- ఏదైనా సమస్యలుంటే 9490555533 వాట్సప్ చేయండి
- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి



మాట్లాడుతున్న సునిత లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మహిళల భద్రతా కోసం ఉద్దేశించిన చట్టాలపై అవగాహనను పెంపొందించుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ వి.సునీత లక్ష్మారెడ్డి సూచించారు. అప్పుడే మహిళలు తమకు అన్యాయం జరిగిన సందర్భాల్లో తగిన న్యాయం పొందవచ్చని హితవు పలికారు. మహిళల హక్కుల పరిరక్షణకు, వారి జీవన స్థితిగతులను మెరుగుపర్చేందుకు మహిళా కమిషన్ నిరంతరం కృషి చేస్తోందని అన్నారు. చైర్ పర్సన్ నేతృత్వంలో సభ్యులు షాహీన్, రేవతి, సూదం లక్ష్మీ, పద్మ, ఈశ్వరీ బాయి, ఉమాదేవిలతో కూడిన రాష్ట్ర మహిళా కమిషన్ బృందం సోమవారం నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అన్ని శాఖల జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం, సెమినార్ నిర్వహించారు. జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విట్టల్ రావు, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్ పర్సన్ ఆకుల లలిత, నగర మేయర్ దండు నీతూకిరణ్, అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, చంద్రశేఖర్ తదితరులు సెమినార్‌లో పాల్గొన్నారు. న్యాయ సేవాధికార సంస్థ ద్వారా, వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో మహిళలు, బాలికల భద్రత, సంక్షేమం, అభివృద్ధి కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలను సంబంధిత శాఖల అధికారులు సెమినార్లో వివరించారు.

ఈ సందర్భంగా మహిళా కమిషన్ చైర్పర్సన్ సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కులను వినియోగించుకుంటూ నేటి సమాజంలో బాలికలు, యువతులు ఉన్నత చదువులు అభ్యసిస్తూ అన్ని రంగాల్లో పురుషులకు సమానంగా రాణిస్తున్నారని అన్నారు. అయినప్పటికీ ఇంకనూ అక్కడక్కడ మహిళల పట్ల వివక్షతతో కూడిన సంఘటనలు జరుగుతూనే ఉన్నాయని ఆవేదన వెలిబుచ్చారు. మహిళల రక్షణ, భద్రత కోసం రూపొందించబడిన చట్టాలపై, రాజ్యాంగం ద్వారా కల్పించబడిన హక్కుల గురించి పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలని సూచించారు. ఆడ, మగ, పేద, ధనిక, చిన్న పెద్ద అనే తేడా లేకుండా రాజ్యాంగం పౌరులందరికీ సమాన హక్కులు కల్పించిందన్నారు. ఈ పరిస్థితిలో మార్పు తేవాలని, మహిళా చట్టాల పట్ల అవగాహన కల్పిస్తూ చైతన్యం పెంపొందించాలని కమిషన్ రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా పర్యటిస్తూ వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. కళాశాలల వద్ద షీ టీం లతో నిఘా ఏర్పాటు చేయాలని, యాంటీ ర్యాగింగ్ కమిటీలను నెలకొల్పాలని సంబంధిత అధికారులకు సూచించారు. వివాహాల రిజిస్ట్రేషన్ చట్టాన్ని ప్రతి ఒక్కరు తప్పనిసరి పాటించేలా చూడాలని, దీనివల్ల విదేశాలకు వెళ్లిన సమయాల్లోనూ ఏవైనా వేధింపులు, అన్యాయాలు ఎదురైతే రక్షణ పొందేందుకు ఆస్కారం ఉంటుందని చైర్ పర్సన్ హితవు పలికారు.

భ్రూణ హత్యల నిరోధక చట్టం, పోక్సో యాక్ట్, గృహ హింస వంటి చట్టాలను ఆకళింపు చేసుకోవాలని, ఏ సమస్య ఎదురైనా ఆత్మస్థైర్యం కోల్పోకుండా ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. వరకట్న హత్యలు, లైంగికదాడి ఘటనల్లో బాధితులకు పరిహారం అందేలా సంబంధిత అధికారులు చొరవ చూపాలన్నారు. బాలికల అభ్యున్నతి, విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు, పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ఏ సమస్య ఉన్నా మహిళలు ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇ-మెయిల్ ద్వారానే కాకుండా వాట్స్ యాప్ నెంబర్ 9490555533 ద్వారా కమిషన్‌కు ఫిర్యాదు చేయవచ్చని చైర్ పర్సన్ సూచించారు. హెల్ప్ లైన్ నెంబర్- 181 ద్వారా కూడా సహాయం పొందవచ్చని అన్నారు.

కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ, మహిళలు, బాలల సంరక్షణ కోసం రాజ్యాంగంలోని చట్టాలను అనుసరిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక రకాల చర్యలు చేపడుతున్నాయని అన్నారు. అయితే క్షేత్రస్థాయిలో వీటిని పరిపూర్ణంగా అమలు జరిగేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అప్పుడే ప్రభుత్వాలు చేపట్టే చర్యలు పూర్తిస్థాయిలో సత్ఫలితాలు ఇస్తాయని తెలిపారు. క్షేత్ర స్థాయిలో ఎవరైనా ఇబ్బందులు పడుతున్నట్లు గమనిస్తే వెంటనే తమకు తెలియజే యాలని, బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు.

అనంతరం జిల్లా అధికారులతో మహిళా కమిషన్ బృందం సమీక్ష నిర్వహించింది. మహిళలపై దాడులు, అత్యాచారాలు, వరకట్న వేధింపులు వంటి కేసుల పురోగతిని సమీక్షిస్తూ అధికారులకు సూచనలు చేశారు. వృద్ధుల అలానాపాలను పట్టించుకోవడం లేదని వచ్చే ఫిర్యాదులపై సత్వరమే స్పందించి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కమిషన్ డైరెక్టర్ శారద, జిల్లా కమిటీ చైర్ పర్సన్ నీరజారెడ్డి, జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారిణి సుధారాణి, అన్ని శాఖల అధికారులతో పాటు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా..?

కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



నవతెలంగాణ-మోపాల్

మోపాల్ మండల కేంద్రంలో సహకార సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సోమవారం అదనపు కలెక్టర్ బి.చంద్రశేఖర్ తో కలిసి పరిశీలించారు. రైతుల నుండి ఇప్పటివరకు సేకరించిన ధాన్యం వివరాల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. రైతుల సౌకర్యార్థం కేంద్రాల్లో అందుబాటులో ఉంచిన సదుపాయాలను పరిశీలించారు. ధాన్యం తరలించిన రైతులను పలకరించి, కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని ఆరా తీశారు. కొనుగోలు కేంద్రం వద్ద రైతులు నిలువ చేసిన ధాన్యం నిల్వలను సందర్శించి నాణ్యతను పరిశీలించారు. తేమ కొలిచే యంత్రం ద్వారా తేమ శాతాన్ని లెక్కించారు. బాగా ఆరబెట్టి, శుభ్రపర్చిన ధాన్యాన్ని తరలించి ప్రభుత్వం ప్రకటించిన మేరకు పూర్తి స్థాయి మద్దతు ధర పొందాలని ఈ సందర్భంగా రైతులను కోరారు. ఎఫ్ఏక్యూ ప్రమాణాల మేరకు అసేంద్రీయ పదార్థాలు, ఇసుక, మట్టి, బెడ్డలు ఒక శాతానికి మించకూడదని, సేంద్రీయ పదార్థాలు, పొట్టు, ఇతర గింజలు ఒక శాతం, పరిపక్వము కానీ, ముడుచుకుపోయిన ధాన్యం మూడు శాతం, చెడిపోయిన, రంగువెలసిన, మొలకెత్తిన ధాన్యం ఐదు శాతం, తక్కువ శ్రేణి గల మిశ్రమం ఆరు శాతం, తేమ 17 శాతానికి మించకుండా చూసుకోవాలని వివరించారు. కాగా, రైతుల సౌకర్యార్థం కేంద్రాల వద్ద మాయిశ్చర్ యంత్రాలు, టార్పాలిన్లు, వెయింగ్ మెషిన్లను సరిపడా సంఖ్యలో అందుబాటులో ఉంచాలని నిర్వాకులను ఆదేశించారు. రైతులకు తగిన నీడను అందించేలా షామియానాలు, తాగునీటి వసతి వంటి సదుపాయాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. అకాల వర్షాలు కురుస్తున్నందున రైతుల నుండి వేగవంతంగా ధాన్యం సేకరిస్తూ, వెంటదివెంట నిర్దేశించిన రైస్ మిల్లులకు తరలించాలని సెంటర్ ఇంచార్జ్ ను ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్, సొసైటీ చైర్మన్ ఉమాపతి రావు, సీఈఓ సాయిచంద్, తహశీల్దార్ లత స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

డాక్టరేట్ అందుకున్న చిన్ని కృష్ణుడు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని చింతలూరు గ్రామానికి చెందిన నాగుల గంగారం ఆలియాస్ చిన్ని కృష్ణుడు సోమవారం డాక్టరేట్ అవార్డు అందుకున్నారు. హైదరాబాద్ నగరంలో తియాలోజికల్ రీసెర్చ్ యూనివర్సిటీ హైదరాబాదులో పదిమందికి ఆంధ్ర ప్రదేశ్ తెలంగాణ రాష్ట్రంలోని పలువురికి వివిధ రంగాల్లో ప్రగతి సాధించిన వారికి డాక్టరేట్ అవార్డులు అందజేశారు. మండలంలోని చింతలూరు గ్రామానికి చెందిన నాగుల గంగారం అలియాస్ చిన్ని కృష్ణుడు సోషల్ సర్వీస్ లో భాగంగా డాక్టర్ రేట్ అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పుప్పాల శ్రీనివాస్ హాజరై అవార్డులు ప్రధానం చేశారని చిన్ని కృష్ణుడు తెలియజేశారు.

సేవాభావంతో బోధించిన పూర్వ విద్యార్థికి సన్మానం

నవతెలంగాణ - బోధన్



సాలూరు మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం నెలలుగా ఉచితంగా సేవా భావంతో విద్యా బోధన చేసిన వికాస్ గిరిని ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి శాలువతో సన్మానించి జ్ఞాపికను బహుకరించారు. నేటి కాలంలో విద్యార్థులకు తన వంతు సహాయంగా ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా బోధించడం అభినందనీయమని ఆమె అన్నారు. కార్యక్రమంలో విద్యాకమిటీ సభ్యులు, ఉపాధ్యాయురాలు కృష్ణవేణి ఉన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె

- మండల సమాఖ్య కార్యాలయాల ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేసిన వీవోఏలు

నవతెలంగాణ-విలేకరులు

ఏర్గట్ల: తమ కనీస వేతనాలు పెంచాలని, తమ సమస్యలు పరిష్కరించాలని మండలంలోని వీవోఏలు సోమవారం మండల సమాఖ్య ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. .3900 రూపాయలకు నెలంతా చాలీచాలని జీతంతో పనిచేస్తున్నామని, ఐకేపీ ఉద్యోగులను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం 18 వేలు ఇవ్వాలని, ఆరోగ్య బీమా సౌకర్యం, 10లక్షల సాధారణ బీమా సౌకర్యం కల్పించాలని అన్నారు. లేకుంటే మెరుపు సమ్మె చేస్తామని తెలిపారు

జక్రాన్‌పల్లి: మండలంలోని మహిళా సంఘాల వీవోఏలకు కనీస వేతనాలు అమలు చేయాలని మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య భవనం ముందు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వివోఏలు మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలుచేసే ప్రతి కార్యక్రమంలో ప్రతి పథకంలో భాగస్వాములు చేస్తున్నప్పటికీ కనీస వేతనం కూడా అమలు చేయడం లేదని వాపోయారు. ఓవైపు మహిళా సంఘాలకు సేవ చేస్తూనే మరోవైపు ప్రభుత్వానికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తూ వివిధ సేవా కార్యక్రమాలలో పాల్గొంటున్న వివోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మండలంలోని వివోఏల యూనియన్ ప్రతినిధులతో పాటు 31 మంది వివోఏలు పాల్గొన్నారు.



ఆర్మూర్‌లో..



ఏర్గట్లలో..

ముప్కాల్: (గ్రామ ఆర్గనైజింగ్ అసిస్టెంట్) వీవోఏలు తమ డిమాండ్ల సాధనకు మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య భవనం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. గ్రామీణాభివృద్ధి శాఖ అభివృద్ధి కోసం పనిచేస్తున్న తమ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 26 నుంచి తమ డిమాండ్ల సాధన కోసం సమ్మెకు దిగనున్నట్లు జిల్లా అధ్యక్షురాలు అరుణ తెలిపారు.డీఆర్డీఏ నుంచి నేరుగా వీవోఏల ఖాతాల్లో జీతాలు పడేలా ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. అర్హులైన వారికి సీసీలుగా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

ఆర్మూర్ :వివోఏలు పట్టణంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షురాలు సువర్ణ, ఉపాధ్యక్షురాలు జ్యోతి మాట్లాడుతూ వీవోఏలు 20 సంవత్సరాల నుంచి పనిచేస్తున్న వారికి ప్రభుత్వ గుర్తింపు లేదన్నారు. గ్రేడింగ్ విధానాన్ని రద్దు చేయాలని, ప్రమాద బీమా పథక సౌకర్యం కల్పించాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని, డ్రెస్ కోడ్ కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంతోష్ శ్రావణి సరోజిని తదితరులు పాల్గొన్నారు..

వేల్పూర్ మండంలో..

30 మంది వివోఏలు మండల సమైఖ్య ఐకెపి ఆఫీస్ ముందు నిరసన తెలిపారు. కార్యక్రమంలో వివో ఏలు అధ్యక్షులు కే లత, కార్యదర్శి ఎస్ కవిత, కోశాధికారి, డి కావ్య, సహ కార్యదర్శి పి మాణిక్ రావ్, ఉపాధ్యక్షులు పి మురళీమోహన్. ఎస్ కవిత, బి అన్నపూర్ణ మిగతా వివోఏలు పాల్గొన్నారు..

ప్రతీ కార్యకర్త ప్లీనరీకి తరలిరావాలి

ప్లీనరీ ఏర్పాట్లు పరిశీలించిన బాజిరెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

ఈనెల 25న భూమారెడ్డి కన్వెన్షన్ హాల్ బోర్గాంలో జరగబోయే బీఆర్ఎస్ పార్టీ ప్లీనరీ ఏర్పాట్లను నిజామాబాద్ గ్రామీణ నియోజకవర్గ, టీఎస్ఆర్టిసి చైర్మన్, నిజామాబాద్ గ్రామీణ నియోజకవర్గ శాసనసభ్యులు బాజిరెడ్డి గోవర్ధన్ సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ గ్రామాన బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగరాలని, ప్రతి కార్యకర్త పార్టీ ప్లీనరీకి తరలి రావాలని అన్నారు. నిజామాబాద్ గ్రామీణ నియోజకవర్గంలో చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ఫోటో గ్యాలరీ ద్వారా ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. సభ వేదిక, పార్కింగ్ స్థలం, వంటశాల, కార్యకర్తలతో సమావేశం కానున్న హాళ్లను నిజామాబాద్ జిల్లా పరిషత్ ఆర్థిక ప్రణాళిక సభ్యులు, జెడ్పిటిసి బాజిరెడ్డి జగన్మోహన్, నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేకంగా పరిశీలించారు.

గ్రామపంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలి

- ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గంగాధర్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గ్రామపంచాయతి సిబ్బందినీ పర్మినెంట్ చేయాలని, ప్రతి నెలా వేతనాల ను క్రమం తప్పకుండా చెల్లించే విధంగా చూడాలని కోరుతూ.. ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి జెపి గంగాధర్ అధ్వర్యంలో సోమవారం సమస్యలతో కుడిన వినతి పత్రాన్ని నడ్పల్లి మేజర్ గ్రామ పంచాయితీ గ్రేడ్-వన్ కార్యదర్శి నిట్టు కిషన్ రావుకు అందజేశారు. ఈసందర్భంగా గంగాధర్ మాట్లాడుతు గ్రామపంచాయతీలో కొన్నేళ్లుగా పనిచేస్తున్న కారోబార్లను, వాటర్‌మెన్, ఎలక్ట్రిషన్, సఫాయ్ కార్మికులందరిని పర్మినెంట్ చేయ లేదన్నారు. కనీసం పీఎఫ్, ఈఎస్ఐ కూడా చేయలేదన్నారు. కనీసం 27వేల రూపాయల జీతం లేదన్నారు. కార్మికులు మృతి చెందితే ఆ కుటుంబన్ని ఆదుకునే నాధుడు లేద న్నారు. ఈ విషయం పైన ఈనెల 10న కమిషనర్‌ని కలిసి వినతి పత్రం ఇచ్చామని తెలిపారు. దీనిపై ఈ నెల 27 న హైదరాబాద్‌లోని సుందరయ్య భవన్‌లో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గ్రామపంచాయతీ నుండి కార్మికులను పంపించాలని అన్నారు.కార్యక్రమంలో కారోబార్లు కె సంతోష్, రాము, కార్మికులు దాస్, దుర్గవ్వ, శంకర్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభించిన పోచారం సురేందర్ రెడ్డి



సురేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న పాఠశాల యాజమాన్యం

నవతెలంగాణ-కోటగిరి

దాహార్తిని తీర్చడానికి వివేకానంద పాఠశాల సౌజన్యంతో కోటగిరి రామకృష్ణ సేవా సమితి వారు ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని సోమవారం పోచారం సురేందర్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు .ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో పోచారం సురేందర్ రెడ్డి మాట్లాడుతూ వివేకానంద పాఠశాల యాజమాన్యం నిరంతరం ప్రజాసేవ చేస్తుందని, ప్రతి సంవత్సరం రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటుచేయడం, మజ్జిగ పంపిణీచేయడం అభినందనీయమని పేర్కొన్నారు అంతకుముందు పోచారం సురేందర్‌రెడ్డికి పాఠశాల తరపున గౌరవ వందనం అందజేసి పాఠశాల నిర్వహిస్తున్న సేవ కార్యక్రమాలను వివరించి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ వల్లేపల్లి శ్రీనివాసరావు, ఎత్తొండ ఉపసర్పంచ్ సుజాత ,మండల రైతు కన్వీనర్ కొల్లూరు కిషోర్ బాబు, సర్పంచ్ పత్తి లక్ష్మణ్, కోటగిరి విండోఅధ్యక్షులు కూచి సిద్దు, ఉపాధ్యక్షులు బొట్టే గజేందర్, నాయకులు బర్ల మధు, శ్రీధర్, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు

బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధుల సభను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



మాట్లాడుతున్న రేగుంట దేవేందర్

మండల కేంద్రం శివారులోని లలితా గార్డెన్‌లో మంగళవారం నిర్వహించనున్న బీఆఎస్ పార్టీ ప్రతినిధుల సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రేగుంట దేవేందర్ అన్నారు. సోమవారం మండలం లోని 10 గ్రామాల బిఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులను కలిసి సభకు హాజరు కావాలని ఆహ్వానించారు. గ్రామాల వారీగా ఇంచార్జిలు పార్టీ ప్రతినిధులను కలిసి మంత్రి ఆదేశాలను తెలిపారు. అన్ని గ్రామాల్లో మంగళవారం ఉదయం 8 గంటలకు బీఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరించి, ప్రజా ప్రతినిధుల సమావేశానికి హాజరుకావాలని కోరారు. ఈ సమావేశానికి రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని దేవేందర్ తెలిపారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బద్దం చిన్నారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మలావత్ ప్రకాష్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీరప్ప కళ్యాణ మహోత్సవం

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలం పెగడాపల్లి గ్రామంలో సోమవారం కురుమ యాదవ సంఘం ఆధ్వర్యంలో బీరప్ప కామరతి కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో బీరప్ప ఆలయానికి తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కుల గురువులు అయినా ఒగ్గు కళాకారులు పాటలు పాడుతూ ప్రత్యేక పూజలతో బీరప్ప కామరతి కళ్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద భక్తులకు అన్నదనం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ శంకర్, సొసైటీ చైర్మన్ రాజిరెడ్డి, గొల్ల కురుమ సంఘం మండల అధ్యక్షులు మేడి రవి, నాయకులు సుధాకర్, కృష్ణారెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆన్‌లైన్ ప్రోగ్రెస్ కార్డుల అందజేత

నవతెలంగాణ-ఏర్గట్ల

పరీక్షలు ముగిసిపోయి, పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6 వ తరగతి నుండి 9 వ తరగతి వరకు చదివిన విద్యార్థులకు మండల నాయకుల చేతుల మీదుగా ఆన్లైన్ ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...రాబోయే తరగతులలో విద్యార్థులు చక్కగా చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపేంధర్ రెడ్డి, జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్, సర్పంచ్ గుల్లే లావణ్య గంగాధర్, ఎంపీటీసీ జక్కని మధుసూదన్, హెచ్.ఎం. మునిరోద్దీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అకాలం.. ఆగమాగం

- వర్షానికి తడిసిన వరి ధాన్యం
- ఈదురుగాలులకు నేల కూలిన చెట్లు, నేలకొరిగిన నువ్వు పంట

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి/మెండోర/ముప్కాల్/మాక్లూర్



కమ్మర్‌పల్లి: నేలవాలిన నువ్వులపంట




కమ్మర్‌పల్లి : రోడ్డుపై పడిన చెట్టు

కమ్మర్‌పల్లి మండలంలో సోమవారం మధ్యాహ్నం గాలివాన దుమారం లేపింది. బలంగా వీచిన ఈదురు గాలులకు పలుచోట్ల చెట్లు నేల కులాయి. పెద్ద ఎత్తున నువ్వు పంట నేల వాలింది. అకాల వర్షానికి కల్లాల్లో రైతులు ఆరబోసిన వరి ధాన్యం తడిసిపోయింది. పలుచోట్ల రైతులు కోతలు కోసి కుప్పలేసిన నువ్వు కుప్పలు తడిసిపోయాయి. మండలంలోని ఉప్లూర్ ఎరుకల కాలనీ వద్ద బలంగా వీచిన గాలులకు చెట్టు బీటీ రోడ్డుపై అడ్డంగా పడింది. దీంతో రాకపోకులకు ఇబ్బందులు తలెత్తాయి. కాలనీవాసులు విషయాన్ని సర్పంచ్ బద్దం పద్మ చిన్నారెడ్డికి తెలియజేయగా బ్లేడు ట్రాక్టర్ తీసుకువచ్చి నేల కూలిన చెట్టును రోడ్డు పక్కకు తొలగించారు.కళ్లల్లో దాన్యం తడిసిపోయి, పంటలు నేలవాలడంతో అన్నదాతలు ఆవేదనకు గురవున్నారు. తడిసిన ధాన్యం రంగు మారితే ఎలా అమ్ముకోవాలని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వమే అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

మెండోరా : మండల పరిధిలో గాలి బీభత్సం సృష్టించడంతో వెల్గటూర్, సావెల్ గ్రామాల శివారులో రోడ్డు ప్రక్కన ఉన్న చెట్లు విరిగి రోడ్లపై పడ్డాయి. వడగండ్ల వాన కురియడంతో సావెల్, వెల్గటూర్ గ్రామాల పరిధిలోని రోడ్లపై ఆరబెట్టిన వరి ధాన్యం తడిసి పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ముప్కాల్: వడగండ్ల వానకు ముప్కాల్ మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. నివాస గృహాలు సైతం దెబ్బతిన్నాయి. ముఖ్యంగా మండలంలోని నాగంపేట్ గ్రామంలో పలు ఇండ్ల పైకప్పులు గాలి దూమారానికి లేచిపోయాయి. విద్యుత్తు స్తంభాలు విరిగిపడ్డాయి. అధికారులు స్పందించి నష్టాన్ని అంచనా వేసి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

మాక్లూర్: మండలంలోని మాదాపూర్, మాక్లూర్ గ్రామాల్లో అకాల వర్షం రావడంతో కోసిన వరి ధాన్యం తడిసి ముద్దైంది. లారీలు సమయానికి రాకపోవడంతో కాంటా అయిన బస్తాలు సైతం తడిశాయి.



మాక్లూర్ : తడిసిన ధాన్యం బస్తాలు



ముప్కాల్ : కిందపడిన కరెంటు స్తంభం

యువకుడి మర్డర్ కలకలం

- స్నేహితులే ఈ ఘాతుకానికి
- పాల్పడ్డారా?
- మృతికి జూదం, మద్యమే కారణమా?

నవతెలంగాణ-డిచ్‌పల్లి

పండగ సందర్భంగా అత్తవారింటికి వెళ్లి కలిసి వద్దామని, సాయంత్రం వరకు రెడీగా ఉండుమని భార్యకు చెప్పి ఇంటి నుంచి వెళ్లిన యువకుడు హత్యకు గురయ్యాడు. ఈఘటన ఇందల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని తిర్మన్‌పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, డిచ్‌పల్లి సిఐ కృష్ణ, ఎస్సై నరేష్ వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన షేక్ నబిసాబ్ (అక్బర్)(28) ఆదివారం ఉదయం ఇంటి నుండి వెళ్లాడు. కొందరు స్నేహితులతో కలిసి వైన్స్ వద్ద మద్యం కొనుగోలు చేసి తాగారు. అక్కడినుండి పేకాటకు వెళ్లినుట్ట పేర్కొన్నారు. రాత్రవుతున్న ఇంటికి తిరిగి రాకపోవడంతో నబిసాబ్ భార్య అమ్రిన్ ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో నిమ్మకుండిపోయింది. రాత్రి అవుతున్న నబిసాబ్ ఆచూకీ లభ్యం కాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు అంతలోనే ఒకచోట నబీసాబ్ కనబడి ఇంటికి వస్తా పో అని చెప్పాడు. అంతలోనే కావాలని కొందరు స్నేహితులు మద్యం ఫుల్లుగా తాగించి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

డిచ్‌పల్లి మండలంలోని రాంపూర్ గ్రామపంచాయతీ శివారులోని ఒక ఫామ్ హౌస్ వద్ద గొడవపడి ఇందల్‌వాయి మండలంలోని తిర్మన్‌పల్లి శివారి లో హత్య చేసి మృతదేహాన్ని అక్కడే పారేసినట్లు వారు వివరించారు. ఫోను, చెప్పులు ఒక ఫామ్ హౌస్‌కు సమీపంలోని తిర్మన్‌పల్లి, రాంపూర్ రహదారి పక్కనే ఉండడంతో సోమవారం ఉదయం అటుగా వెళు తున్న ఒకరికి ఫోన్ కంటపడింది. ఫోన్ తీసుకొని ఇంటికి పోయి ఛార్జింగ్ పెట్టారు. ఫోన్‌రావడంతో ఫోన్ దొరికిన వ్యక్తి మాట్లాడుతూ తనకు ఈ ఫోను ఫలానా చోట దొరికిందని తెలిపారు. ఆ ఫోను తిరిగి కుటుంబ సభ్యులకు అందజేశాడు. వాకింగ్‌చేసే కొందరు కోళ్ల ఫారం వద్ద మృతదేహం కనిపించడంతో వెంటనే పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతునికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. కొట్టి చంపినట్లు ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. హత్యకు మద్యం పేకాట కారణమని కుటుంబ సభ్యులు ఆరోపించారు. డాగ్ స్క్వాడ్ ను రప్పించారు. ఘటన స్థలం నుండి ఫామ్ హౌస్ అక్కడినుండి తిరుమల సమీపన ఉన్న వైన్ వద్దకు వెళ్ళింది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోస్ట్ మాస్టర్ నిమిత్తం జిల్లా కేంద్రంలోని మార్చుటకు తరలించినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు తెలిసింది.

స్థాయి మరిచి మాజీ మంత్రిని విమర్శించవద్దు

నవతెలంగాణ-బోధన్

తమ స్థాయి మరిచిన నాయకులు ఒక మాజీ మంత్రిని ఇష్టమున్నట్లు మాట్లాడడం తగదని, వారి స్థాయి తెలుసుకొని మాట్లాడాలని అమ్దాపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. సోమవారం అమ్దాపూర్ గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మాజీ మంత్రిచ పీసీసీ కోశాధికారి సుదర్శన్ రెడ్డిని విమర్శించే స్థాయి లేదని గ్రామ సర్పంచ్ భర్త సిర్ప సుదర్శన్‌పై మండిపడ్డారు. గురువారం సుదర్శన్ రెడ్డి అమ్దా పూర్ గ్రామంలో పర్యటించి కార్యకర్తల బాగోగులు అడిగి తెలుసుకు న్నారని, గ్రామ ప్రజలతో కలిసి ముచ్చటించారని అన్నారు. గ్రామస్తులు కోరగా డబుల్ ఇండ్లను పరిశీలించారని తెలిపారు. అవి నాసిరకంగా నిర్మించారని, పైన స్లాబ్ పగుళ్ల రావడంతో వర్షా కాలంలో గదులలో నీరు నిలిచే అవకాశం ఉందని అన్నారని తెలిపారు. నాసిరకంగా నిర్మించిన కాంట్రా క్టర్‌పై సంబంధిత అధికారులు చర్యలు తీసుకో వాలని అన్నారని తెలిపారు. డబుల్ బెడ్రూ మ్‌లు లబ్ధిదారులకు ఎందుకు పంపిణీ చేయడం లేదని సుదర్శన్‌రెడ్డి ప్రశ్నించారని అన్నారు. పాథమిక పాఠశాలలో నాణ్యతా ప్రమాణాలు లేకుండా నిర్మించిన మరుగు దొడ్ల నిర్మాణంపై కలెక్టర్ స్పందించి విచారణ చేపట్టాలని అందుకు బాధ్యులైన పంచాయతీరాజ్ శాఖ ఏఈని సస్పెండ్ చేసి కాంట్రాక్టర్‌పై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ నాయకుడు బొబ్ర పల్లన్న, మైనర్టీ సెల్ మండల అధ్యక్షుడు ఎం డి. రఫీ, మాజీ సొసైటీ చైర్మెన్ పోరెడి గంగాధర్, బద్దం సుమన్, నమిల్ల పెద్ద సాయన్న పాల్గొన్నారు.

జెంటిల్ కిడ్స్ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే



గ్రాడ్యుయేషన్‌డేలో పాల్గొన్న విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని యోగేశ్వర కాలనీ జెండాగల్లిలో గల జెంటిల్ కిడ్స్ ప్లే స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డేను సోమవారం ఎంఆర్ గార్డెన్ లో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రీస్కూల్ ని కంప్లీట్ చేసుకుని ప్రైమరీ స్కూల్‌కి వెళ్తున్న సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమక్షంలో ఘనంగా స్నాతకోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథి మండల్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పింజ రాజా గంగారాం సమక్షంలో వీరికి జెంటిల్ కిడ్స్ స్కూల్ యాజమాన్యం సర్టిఫికెట్స్, గోల్డ్ మెడల్స్‌తో సత్కరించారు. అబాకస్‌లో జిల్లా స్థాయిలో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్స్‌తోపాటు ఈ సంవత్సరం ఉత్తమ ఫలితాలను పొందిన విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ సిల్వర్ మోడల్స్‌తో సత్కరించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో వారి ప్రతిభను కనబరిచారు. ఈ విద్యా సంవత్సరంలో భాగంగా చక్కని నడవడికను క్రమశిక్షణ కలిగిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు పాఠశాల యాజమాన్యం గుజరాతి ప్రకాష్, లతా తల్లిదండ్రులకు గిఫ్టులు అందించారు.

వరి ధాన్యాన్ని పరిశీలించిన సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ-మాక్లూర్



ధాన్యం పరిశీలిస్తున్న నాయకులు

మండల కేంద్రంలోని సొసైటీకి దగ్గరలో ఉన్న ఆరబెట్టిన వరి ధాన్యాన్ని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కొండ గంగాధర్, తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకటేష్ సోమవారం పరిశీలించారు. వర్షం ఎప్పుడు పడుతుందో తెలియని పరిస్థితి ఉందని, వడ్ల కాంటాలు ఒకటి కంటే ఎక్కువ ఏర్పాటు చేయాలని అన్నారు. హమాలీలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని, ధాన్యం కాంటాలు పెంచుతూ వెనువెంటనే రైస్ మిల్లుకు తరలించాలని డిమాండ్ చేశారు. ఆరబెట్టిన ధాన్యానికి తాటిపత్రులు అందుబాటులో ఉంచాలని, రైతులకు నీడకు టెంట్లు వేసి సౌకర్యాలు కల్పించాలని అన్నారు. కాంటాఅయిన వడ్లను వెంటవెంటనే పంపించినట్లయితే ఇతరులకు కూడా సౌకర్యం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో రైతులు శ్రీనివాస్, రాజు, నర్సయ్య పాల్గొన్నారు.

నిరుద్యోగుల ఆశయాలు నిర్వీర్యం చేసిన ప్రభుత్వాలు

కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి

నవతెలంగాణ-మెండోర

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగుల ఆశయాలను నిర్వీర్యం చేశాయని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ ఒడ్డి అన్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్యం రెడ్డి ఆధ్వర్యంలో నడిమితండాలో సోమవారం హాత్ సే హాత్ జోడో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల.మోహన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ రాహుల్ గాంధీ భారత్ జూడో యాత్ర సందేశాన్ని ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు అందించారు. పాధి కూలీలతో మాట్లాడారు. ఉద్యోగాలు లేక విద్యావంతులైన పిల్లలు కూడా ఉపాధి హామీ కూలీకి రావాల్సిన పరిస్థితి వచ్చిందని కూలీలు వాపోయారు. అనంతరం కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని భరోసా ఇచ్చారు. సిలిండర్ 500 రూపాయలకు అందిస్తామని, ఏకకాలంలో రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేస్తామని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఐదు లక్షల రూపాయలు అందిస్తామని, భూమిలేని ఉపాధి హామీ కార్డు ఉన్న పేదలకు సంవత్సరానికి 12వేలు అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో ముప్కాల్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు గంగాధర్, జిల్లా ఎన్ఎస్ యుఐ అధ్యక్షులు వేణురాజ్ , ముప్కాల్ కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు ముత్యంరెడ్డి, డిసిసి కార్యదర్శి రాజేందర్, మెండోర మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయి , రవి , నడిమితండా ఉపసర్పంచ్ శ్రీనివాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

నవతెలంగాణ
కామారెడ్డి
మంగళవారం 25 ఏప్రిల్ 2023

విద్యార్థులకు ప్రొగ్రెస్ కార్డులు అందజేత

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని శెట్పల్లి సంగారెడ్డి ప్రాథమిక పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులకు ఆన్‌లైన్ ప్రోగ్రెస్ కార్డులు గ్రామ సర్పంచ్ అనిల్ రెడ్డి చేతుల మీదుగా సోమవారం అందజేసినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాల్ రెడ్డి తెలిపారు. విద్యా సంవత్సరంలో విద్యార్థుల ప్రగతిని వివరించారు. రానున్న విద్యా సంవత్సరం దృష్టిలో ఉంచుకొని తమ పిల్లలు ఏ విధంగా చదువుతున్నారు.. ఈ విద్యా సంవత్సరం ఎంత ప్రతిభ కనబరిచారో వారి తల్లిదండ్రులకు వివరించినట్టు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ అనిల్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు బాల్‌రెడ్డి, చైర్మన్ కిషన్ ప్రసాద్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

వేసవి సెలవుల్లో విద్యార్థులను బయట తిరగనివ్వొద్దు

నవతెలంగాణ-తాడ్వాయి

విద్యార్థులను వేసవిసెలవుల్లో బయట ఎండలో తిరగనివ్వద్దని ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్ అన్నారు. సోమవారం మండలంలోని కృష్ణజీవాడి గ్రామంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను బయట తిరగనివ్వకుండా చూసుకోవాలని చెప్పారు. గడిచిన సంవత్సరం చదువుకున్న వాటిని చదువుకునేల చూడాలన్నారు. అనంతరం విద్యార్థులకు మార్కుల మెమోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జర్మబోయి శ్వేత, విద్య కమిటీ చైర్మన్ బాలకిషన్ రావ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తమ్ముడి పెండ్లిపత్రికలు పంచడానికి వెళ్తూ రోడ్డు ప్రమాదంలో అన్న మృతి

నవతెలంగాణ-గాంధారి/సధశివనగర్


లక్ష్మణ్

కొన్ని రోజుల్లో వారి ఇంట్లో పెండ్లి భాజాలు మోగాల్సి ఉండగా.. అనుకోని రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదం నింపింది. తమ్ముడి పెండ్లి పురస్కరించుకొని పెండ్లి పత్రికలు ఇచ్చేందుకు వెళ్లిన అన్న రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఈ ఘటన సదాశివనగర్ మండలంలోని మల్లుపేట్ స్టేజీ వద్ద సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గాంధారి మండలంలోని నేరల్ గ్రామానికి చెందిన చాకలి లక్ష్మణ్ (35) సాగు చేసుకుంటూ ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. అతని చిన్న తమ్ముడి పెండ్లి వచ్చే నెల 3వ తేదీనా ఉండగా.. బంధువులను పిలిచేందుకు సోమవారం ఉదయం బైక్‌పై నెరల్ నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్నారు. మల్లుపెట్ స్టేజి వద్ద మహారాష్ట్రకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో లక్ష్మణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. లక్ష్మణ్ మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. మృతుడు లక్ష్మణ్‌కు భార్య కుమారుడు కూతురు ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రం ప్రారంభించి నీళ్లు పోస్తున్న సభ్యులు

నవతెలంగాణ-బిచ్కుంద

భూమి ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బిచ్కుంద మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని బిచ్కుంద తహసిల్దార్ భరత్ ప్రారంభించారు. భూమి ఫౌండేషన్ సభ్యులు ఎన్నో స్వచ్ఛంద సేవ కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు ఆసరాగా నిలుస్తున్నారని అన్నారు. అందులో భాగంగానే ప్రతి సంవత్సరం అంగడి బజార్లో, బస్టాండ్ ప్రాంతంలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీరుస్తున్నారని, బస్టాండ్ ప్రాంతంలో ఏర్పాటుచేసిన చలివేంద్రంలో అంబలి, మజ్జిగతో పాటు స్వచ్ఛమైన చల్లటి తాగునీరు ప్రజలకు అందించడం పట్ల అభినందించారు. ఈ కార్యక్రమంలో భూమి ఫౌండేషన్ స్వచ్ఛంద సభ్యులు బసవరాజ్, పిట్లసాయిలు, పంచర్ బాలాజీ, నిసార్, అనిల్, సాయిలు, రవి, బాసపవన్, బాలు, సంగ్రామ్ గ్రామస్తులు ఉన్నారు.

కార్యకర్తకు ఎమ్మెల్యే పరామర్శ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండలంలోని భిక్కనూరు గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నేత నెల్లి గోపాల్‌ను సోమవారం ఎమ్మెల్యే జాజాల సురేందర్ పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురైన గోపాల్ హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సురేందర్ ఆయన ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు జలంధర్ రెడ్డి, సొసైటీ చైర్మన్ ఏగుల నర్సింలు, స్థానిక ఉప సర్పంచ్ గోనె శ్రీకాంత్, గ్రామ పార్టీ శాఖ అధ్యక్షులు ఆంధ్రయ్య, తదితరులు ఉన్నారు.

తాడ్వాయి ప్రెస్‌క్లబ్ అధ్యక్షులుగా పాగల సాయిబాబా

నవతెలంగాణ-తాడ్వాయి


సాయిబాబా

తాడ్వాయి మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా పాగాల సాయిబాబా ఎన్నికయ్యారు. ప్రెస్ క్లబ్ కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పాగాల సాయిబాబా (నవతెలంగాణ), ఉపాధ్యక్షులుగా నడిపి రాజ్‌కుమార్ (ఆంధ్రజ్యోతి), ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్‌రెడ్డి (Ꮷ9), క్యాషియర్‌గా కృష్ణ చైతన్య గౌడ్ (వెలుగు) సభ్యులుగా నర్సింలు (నమస్తే తెలంగాణ), నవీన్ రావు (ఆంధ్ర ప్రభ), మురళి (ప్రజాజ్యోతి), నరేష్ (దిశ), సునీల్ (ఈనాడు)ను ఎన్నుకున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ


చెక్కులు అందజేస్తున్న విప్ గంపగోవర్ధన్

నవతెలంగాణ-కామారెడ్డి(తాడ్వాయి)

కామారెడ్డి నియోజకవర్గంలోని 23 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన 15 లక్షల 56 వేల రూపాయల చెక్కులను ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ సోమవారం జిల్లా కేంద్రంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండవ సారి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కామారెడ్డి నియోజకవర్గం వ్యాప్తంగా ఇప్పటివరకు 1,891 మందికి 11 కోట్ల 57 లక్షల 22 వేల 200 రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన చెక్కులను పంపిణీ చేసినట్టు తెలిపారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

- వరి కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవం

నవతెలంగాణ-దోమకొండ/ఎల్లారెడ్డి

ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని ముత్యంపేట విండో చైర్మన్ కోడిప్యాక తిరుపతి గౌడ్ సూచించారు. దోమకొండ మండలంలోని ముత్యంపేట విండో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించాలని, కొనుగోలు కేంద్రాల్లో కింటల్‌కు ఏ గ్రేడ్ ధాన్యానికి ప్రభుత్వం 2060, రూపాయలు గిట్టుబాటు ధరను అందజేస్తున్నట్టు తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రల్లోనే ధాన్యం విక్రయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ తీర్మాల్ గౌడ్, సొసైటీ వైస్ చైర్మన్ సిద్దరాములు, ఏయంసి డైరెక్టర్ లలిత, సర్పంచ్ సూర్య ప్రకాష్ రెడ్డి, సొసైటీ సీఈఓ రాంచంద్రం, సొసైటీ డైరెక్టర్ లు, రైతులు పాల్గొన్నారు.


దోమకొండ మండలం ముత్యంపేట్‌లో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న పలువురు

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి మండలంలోని వెలుట్ల, ఎ ల ం ట్ల ే ఎ ట్ ', వెంకటాపూర్, గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం సొసైటీ చైర్మన్ పటేల్ సాయిలు వైస్ చైర్మన్ ఎల్లప్ప ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆరు కాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో వెల్లుట్ల సర్పంచ్ గంటరాజేశ్వరి సాయిలు, ఎంపిటిసి సుతారి లక్ష్మి సాయిలు, వెంకటపూర్ సర్పంచ్ గొలపల్లి సురేఖ మల్లేశ్ ఏఈఓ రాజగౌడ్ వెల్లుట్ల రైతు కమిటీ అధ్యక్షులు వెంకటరమణ, వెల్లుట్ల పేట రైతు కమిటీ అధ్యక్షులు కొయ్యల నిర్మల విఠల్‌గౌడ్, వెంకటపూర్ రైతు కమిటీ అధ్యక్షులు అయ్యల సాయిలు వెల్లుట్ల పేట్ ఉపసర్పంచ్ కొయ్యల వినోద రాజాగౌడ్ వివిధ గ్రామాల సర్పంచులు ఉప సర్పంచ్ సొసైటీ డైరెక్టర్లు రైతులు పాల్గొన్నారు

మమ్మల్ని క్రమబద్ధీకరించండి

- సీఎం కేసీఆర్‌కు జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పోస్టుకార్డులు

నవతెలంగాణ-మద్నూర్/తాడ్వాయి

తమను రెగ్యులర్(క్రమబద్ధీకరణ) చేయాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు కోరుతూ సీఎం కేసీఆర్‌కు పోస్టుకార్డులు పంపారు. వారి యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సీఎం కేసీఆర్‌కు పోస్టుకార్డుల ద్వారా వినతిపత్రాలు పంపారు. మద్నూర్‌లో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షులు ప్రమోద్ మాట్లాడుతూ తమ సర్వీస్ నాలుగేండ్లు పూర్తయిన నేపథ్యంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు తమను రెగ్యూలర్ చేయాలని కోరారు.



మద్నూర్‌లో పోస్టుకార్డులు చూపుతున్న జేపీఎస్‌లు

రెగ్యూలర్ చేయండి

తాడ్వాయి : తాడ్వాయి మండల జూనియర్ పంచాయతీ కార్యదర్శులందరూ కలసి సీఎం కేసీఆర్‌కు పోస్టుకార్డులను పంపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నోటిఫికేషన్ ప్రకారం 3 సంవత్సరాల ప్రొబేషన్, అసెంబ్లీ సాక్షిగా మరో ఏడాది పెంచినా నమ్మకంతో విధులు నిర్వహించడమే కాకుండా ఉత్తమ పంచాయతీ లుగా తీర్చి దిద్దాడానికి తమ వంతుగా కృషి చేస్తున్నామని తెలిపారు. కావున తమను రెగ్యూలర్ చేయాలని కోరారు.

జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ఆత్మీయుల సమ్మేళనం

నవతెలంగాణ-లింగంపేట్

పంచాయతీరాజ్ దినోత్సవం పురస్కరించుకొని సోమవారం పంచాయతీ కార్యదర్శుల ప్రొబేషన్ పీరియడ్ 4 సంవత్సరాలు పూర్తి అయినా సందర్భంగా స్థానిక మండల్ పరిషత్ కార్యాలయంలో స్థానికసంస్థల ప్రజాప్రతినిధులతో పంచాయతీ కార్యదర్శుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సమావేశంలో జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశంలో పంచాయదా జూనియర్ కార్యదర్శిలను రెగ్యులర్ చేయాలని ఏకగ్రీవ తీర్మానం చేసినందుకు , జడ్పీటీసీ శ్రీలత సంతోష్ రెడ్డిని, ఎంపీపీ గరీబున్నీస నయీంలను శాలువలు కప్పి సన్మానించారు.


జడ్పీటీసీ, ఎంపీపీని సన్మానిస్తున్న జేపీఎస్‌లు

సమావేశంలో పంచాయతీ కార్యదర్శిలు ప్రతినిధులు మాట్లాడుతూ తెలంగాణ రాష్టం లోని ప్రతి పల్లె అభివృద్ధి చెందడంలో, అలాగే దేశం లో రాష్టం సాధించిన అవార్డులు, ప్రత్యేక నిదర్శనం అని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలతో పాటు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల్లో తాము ప్రధాన పాత్ర పోషించినట్టు తెలిపారు. ప్రజా ప్రతినిధుల సహకారంతో నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్నామన్నారు.

జూనియర్ పంచాయతీ కార్యదర్శులందరూ ఏప్రిల్ 28 నుండి చేపట్టబోయే సమ్మెకు సర్పంచులందరు మద్దతు ఇవ్వాలని సర్పంచ్‌ల ఫోరమ్ మండల అధ్యక్షుడుకి కార్యవర్గ సభ్యులకు వినతిపత్రం అందజేశారు.

ప్రొఫెసర్ బాలశ్రీనివాసమూర్తి మరణం తీరని లోటు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

తెలంగాణ యూనివర్సిటీ ప్రొఫెసర్ బాల శ్రీనివాస్‌మూర్తి అకాల మరణం తీరని లోటని ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆయన గుండెపోటుతో మృతిచెందడంతో డిగ్రీ కళాశాలలో ఉదయం విద్యార్థులు, అధ్యాపకులు 2 నిమిషాల మౌనం పాటించి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కళాశాల తెలుగు అధ్యాపకులు ప్రభాకర్ రావు మాట్లాడుతూ ప్రొఫెసర్ బాల శ్రీనివాస మూర్తి మొదట అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఎదిగి అసోసియేట్ ప్రొఫెసర్‌గా ప్రమోషన్ పొంది ఈ మధ్య కాలంలోనే ప్రొఫెసర్‌గా కూడా ప్రమోషన్ పొంది తెలంగాణ యూనివర్సిటీ లో మంచి పేరు తెచ్చుకున్నారని తెలిపారు. కొన్ని గ్రంథాలను రాసి విద్యార్థుల జీవితాలను ప్రభావితం చేశారని చాలా కష్టజీవి అని తనతో ఉన్న ఆత్మీయ బంధాన్ని గుర్తు చేసుకొని భావోద్వేగానికి గురైయ్యారు.


నివాళి అర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని రెండో వార్డు పరిధిలోని వడ్డెర కాలనీలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం పట్వారి స్వచ్ఛంద సేవా సంస్థ అధినేత రోటరియన్ తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ న్యాయవాది, మున్సిపల్ కౌన్సిలర్ సంగీత ఖాండేష్ హాజరై దాత తిరుపతి రెడ్డి చేస్తున్న సేవా కార్యక్రమాలు చాలా గొప్పవి అని అభినంది శాలువా పూల మాలలతో సన్మానించారు. అ కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి అధ్యక్షత వహించరు కార్యక్రమములో రొటీరియన్ జి సాయన్న,ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మినీ ప్లీనరీలు

- నియోజకవర్గాల వారీగా సమావేశాలు
- నేడు ఎల్లారెడ్డి, బిచ్కుందలో, రేపు బాన్సువాడలో మీటింగ్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి/బిచ్కుంద/నసురుల్లాబాద్

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో బీఆర్ఎస్ ప్రతినిధుల సమావేశాన్ని నిర్వహించాలని అధిష్టానం పిలుపుమేరకు నియోజకవర్గాల్లో ఆ మేర పార్టీ శ్రేణులు ఏర్పాటు చేపట్టారు. నేడు ఎల్లారెడ్డి, జుక్కల్‌లో మినీ ప్లీనరీ సమావేశాలుండగా.. రేపు బాన్సువాడలో జరగనున్నాయి. ఎల్లారెడ్డిలోని రాఘవులు ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆధ్వర్యంలో నేడు(మంగళవారం) ఉదయం పది గంటలకు సమావేశం నిర్వహించనున్నట్టు మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు జలంధర్ రెడ్డి తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశానికి నియోజకవర్గంలోని ప్రతినిధులు, జిల్లా రాష్ట్ర స్థాయి నాయకులతో పాటు ప్రజాప్రతినిధులు పాల్గొంటారని ఈ సమావేశం ముఖ్య ఉద్దేశం రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పలువురు వక్తలు ప్రసంగిస్తరని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు అధిములం సతీష్, శ్రీను నాయక్, అరవింద్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బిచ్కుంద : బిచ్కుంద మండల కేంద్రంలోని బండయప్ప కళ్యాణ మండపంలో బీఆర్ఎస్ పార్టీ జుక్కల్ నియోజకవర్గ స్థాయి ప్లీనరీ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్రావు దేశయి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా పరిషత్ చైర్మన్ దఫేదార్ శోభరాజు, అసెంబ్లీ ప్యానల్ స్పీకర్, జుక్కల్ శాసనసభ్యులు హనుమంత్ షిండే పాల్గొంటారని జుక్కల్ నియోజకవర్గంలోని జడ్పిటిసిలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, పార్టీ మండల అధ్యక్షులు, గ్రామ అధ్యక్షులు, కార్యదర్శులు, కమిటీ సభ్యులు, కార్యకర్తలు సరైన సమయానికి అధిక సంఖ్యలో పాల్గొని ప్లీనరీ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రేపు మినీ ప్లీనరీ

నసురుల్లాబాద్ : బాన్సువాడ నియోజకవర్గ పరిధిలోని బాన్సువాడ పట్టణంలో రాష్ట్ర స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించబోయే బిఆర్ఎస్ నియోజకవర్గస్థాయి మినీ పార్టీ ప్లీనరీని విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు పెరిక శ్రీనివాస్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంగళవారం ఉదయం ప్రతి గ్రామంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు ఇతర, కార్యకర్తల, నాయకుల సమన్వయంతో పార్టీ జెండా ఎగరవేసి విజయవంతం చేయాలన్నారు. బిఆర్ఎస్ పార్టీ క్రమశిక్షణకు మారుపేరుగా ప్రతి ఒక్కరు ఉండాలని, ప్రతి కార్యకర్త జండా కార్యక్రమంలో పాల్గొన్నారు. బాన్సువాడలో నిర్వహించే మినీ ప్లీనరీ కార్యక్రమానికి ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, వార్డ్ మెంబర్లు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. పార్టీ కార్యకర్తలే నాయకులుగా ఎదిగేందుకు ప్లీనరీ ఎంతగానో దోహదపడుతుందని, ఈ ప్లీనరీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలే గ్రామ గ్రామాన విస్తరింపజేసి, వివరించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆయన గుర్తు చేశారు. ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి వచ్చి ప్లీనరీని విజయవంతం చేసి అదే స్ఫూర్తితో గ్రామ గ్రామాన నాయకులుగా ఎదిగి రాబోయే ఎన్నికలలో విజయం సాధించే దిశగా అడుగులు వెయ్యాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పార్టీ జిల్లా కో ఆప్షన్ నెంబర్ మజీద్ తదితరులు ఉన్నారు.


నసురుల్లాబాద్‌లో మాట్లాడుతున్న పెర్కశ్రీనివాస్‌లు

అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలి


వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణలకు అడ్డుకట్ట వేయాలని సోమవారం ఎల్లారెడ్డి తహశీల్దార్ సుధాకర్‌కు కాంగ్రెస్ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. నాయకులు మాట్లాడుతూ ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులోని 822 సర్వే నంబర్‌లో అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారని ఆరోపించారు. గతంలో 2006లో ప్రభుత్వం 20 నుండి 30 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించారని, ఇచ్చిన 3 సంవత్సరాల్లో ఇల్లు నిర్మించకపోతే తిరిగి స్వాధీనం చేసుకుంటామని అప్పటి ప్రభుత్వ తెలిపిందని దీనిపై కొందరు 2019 లో కోర్టు ను ఆశ్రయించగా కోర్టు అప్పుడున్న తహశీల్దార్ కి వెళ్లి నివేదిక ఇవ్వాలని ఆదేశించారని తెలిపారు. తహశీల్దార్ నివేదికలో ఎలాంటి నిర్మాణాలు జరగలేదని అప్పటి నుండి అక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని తెలిపారు. కానీ కొంతమంది రాజకీయ పలుకుబడి ఉపయోగించుకొని రాత్రికి రాత్రే అక్రమ నిర్మాణాలను చేపడుతున్నారని వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. అక్రమంగా నిర్మిస్తున్న వాటిని తొలగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి నర్సింహులు, ఆఫీజ్, జనార్ధన్ రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 57 ఫిర్యాదులు

- తక్షణమే పరిష్కరించాలి : అడిషనల్ కలెక్టర్


వినతులు స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి(తాడ్వాయి)

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు తక్షణమే పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ ఆదేశించారు. కామారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. మొత్తం 57 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో రెవన్యూ 35, డీపీవోపై 12 ఫిర్యాదులు అధికంగా వచ్చినట్టు తెలిపారు. వచ్చిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులకు పంపి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. వచ్చిన ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఏవో రవీందర్, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

కంటి వెలుగును వినియోగించుకోవాలి

- సర్పంచ్ బత్తూరు సాయిలు


కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

నవతెలంగాణ-నవీపేట్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని లింగాపూర్ గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ బత్తూరు సాయిలు అన్నారు. లింగాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో కంటి వెలుగు శిబిరం సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వేసిన ముగ్గులు అందర్నీ ఆకర్షించాయి. సర్పంచ్ బత్తూరు సాయిలు మాట్లాడుతూ రాష్ట్రంలో కంటిచూపు సమస్యలు లేకుండా ఉండేందుకు ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన పథకాన్ని లింగాపూర్ గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సాధన, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు బుచ్చన్న, వార్డు సభ్యులు కళ్లెం లక్ష్మి, కాడ సాయిలు, కార్యదర్శి వనజ, వైద్య సిబ్బంది కవిత, అక్షయ్, ఏఎన్ఎంలు శైలజ, లక్ష్మి, నర్మదా, సుమలత గ్రామస్తులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభించిన ఎంపీపీ

నవ తెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఎంపీపీ కుంచాల విమల రాజు చలివేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఎంపీటీసీ గంగారెడ్డి ఏర్పాటుచేసిన చలివేంద్రాని ఎంపీపీ పారంభించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ లక్ష్మణ్.ఎస్ఐ శ్రీకాంత్, ఎంఇఓ శ్రీనివాస్, సర్పంచ్ బాలకిషన్, వైస్ ఎంపీపీ తిరుపతి రెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షులు నట్ట భోజన్న, బుల్లెట్ అక్బర్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ

సిద్దుల గుట్టపై ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని స్థానిక ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి సతీమణి రజిత రెడ్డి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిద్దుల గుట్టపై రామాలయం, దత్తాత్రేయ, అయ్యప్ప తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించినారు. ప్రతి సోమవారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో భక్తులకు వడ్డించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సున్కారి సుజాత రమేష్, ఆలయ కమిటీ సభ్యులు సుమన్, పిసి గంగారెడ్డి, కిషన్, అయ్యప్ప శ్రీనివాస్, చిన్నారెడ్డి, మీనా చంద్, తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మించి ఇవ్వాలి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఇల్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మించి ఇవ్వాలని, ఇంటి స్థలం ఉన్న పేదలకు ఇల్లు నిర్మించుకోవడానికి పది లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఐ (ఎం.ఎల్) ప్రజాపంథా రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సో మవారం గిరిరాజ్ కాలేజీ నుండి ర్యాలీగా వెళ్లి కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయంలోకి ఎవరు వెళ్లకుండా దిగ్బంధనం చేశారు. నినాదాలు చేస్తూ పాటలు పాడి నిరసన తెలిపారు. అనంతరం ఏవోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఇల్లు లేని వారందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కట్టించి ఇస్తానని గొప్పలు చెప్పారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇళ్ల నిర్మాణానికి మేమే నిధులు ఇస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్నదన్నారు. వాస్తవానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను తప్పుడు ప్రకటనలు, హామీలతో మోసం చేస్తూ కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. గతంలో గృహ నిర్మాణాల కోసం ప్రత్యేకించి గృహ నిర్మాణ శాఖ ఉండేదన్నారు. కేసీఆర్ సర్కారు ఆ శాఖనే ఎత్తివేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే గృహ నిర్మాణ శాఖను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అర్హులైన వాళ్లందరికీ ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిచో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను ఉదతం చేస్తామన్నారు. సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా సహాయ కార్యదర్శి వి.ప్రభాకర్ మాట్లాడుతూ... ఇంటి స్థలం, ఇల్లు లేని వాళ్ళు ఒకవైపు, ఇంటి స్థలం ఉండి, ఇల్లు నిర్మించుకునే స్థోమత లేక ఇబ్బందులు పడుతున్నవారు, మరోవైపు ప్రభుత్వ ఆసరా కోసం ఎదురు చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి బి.దేవారం, నిజామాబాద్ డివిజన్ కార్యదర్శి ఎం.వెంకన్న, బోధన్ డివిజన్ కార్యదర్శి డి.రాజేశ్వర్, నిజామాబాద్ నగర కార్యదర్శి ఎం.సుధాకర్, పార్టీ జిల్లా నాయకులు ఎం.నరేందర్, ఎం.ముత్తెన్న, కే.గంగాధర్, బి.మల్లేష్, పి.రామకృష్ణ, ఎస్.సురేష్, సి.హెచ్ సాయగౌడ్, ప్రజా సంఘాల బాధ్యులు వి గోదావరి కే సంధ్యారాణి, బి.కిషన్, ఎం. నరేందర్, కే గణేష్ , గుమ్ముల గంగాధర్, జి.కిషన్, రమేష్, మురళి, రాజేశ్వర్, అశుర్, పేదలు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్నా నాయకులు

జేసీని కలిసిన జిల్లా సొసైటీల చైర్మన్లు



జెసీకి సమస్యలను వివరించిన సొసైటీల చైర్మన్లు

నవతెలంగాణ-ఆర్మూర్

దొడ్డు రకం వడ్లను రైస్ మిల్లర్లు తీసుకోనందున జేసీ చంద్రశేఖర్‌ను సొసైటీ చైర్మన్లు సోమవారం కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడ్తా కూడా తీయకుండా, లారీలు కూడా తొందరగా పంపేటట్టు చర్య తీసుకోవాలని రైస్ మిల్లర్లను ఒప్పించాలని విన్నవించారు. కార్యక్రమంలో చైర్మన్లు భోజారెడ్డి, కార్తీక్‌రెడ్డి, హేమంత్ రెడ్డి, బి గంగారెడ్డి, హన్మండ్లు, ఏ.గంగారెడ్డి, భరత్ రెడ్డి, రాజేందర్, శ్రీనివాస్‌రెడ్డి, మహిపాల్, ముత్తెన్న, తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీ పూర్వవైభవం కోసం కృషిచేయాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలుగుదేశం పార్టీ పూర్వవైభవం కోసం కృషి చేయాలని అర్బన్ అడాహక్ కమిటీ కన్వీనర్ కోయేడి నర్సింలు అన్నారు. తెలుగుదేశం పార్టీ నిజామాబాద్ అర్బన్ అడాహక్ కమిటీ కన్వీనర్ కోయేడి నర్సింలు అధ్యక్షతన జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో కోయేడి నర్సింలు మాట్లాడుతూ నిజామాబాద్ అర్బన్ లో తెలుగుదేశం పార్టీ పూర్వవైభవంకోసం నిజామాబాద్ అర్బన్ లోని అన్ని డివిజన్లో డివిజన్ కోఆర్డినేటర్స్ కలిసికట్టుగా కృషి చేయాలని అన్నారు. ఈ సందర్భంగా జోన్లవారీగా బాధ్యతలను అప్పగించారు. జోన్ 1,4 బాధ్యులుగా ప్రతాప్ రెడ్డి, అంబిక సత్యనారాయణ, లవంగా రాజు, వెంకటేష్, జోన్ 2, 3 కల్లెడ గంగాధర్, శంకర్ ముదిరాజ్, నారా గౌడ్, సల్ల సత్యనారాయణ, హనుమంతరావు, జోన్ 5 షేక్ ఫెరోజ్, అశోక్ అరసపల్లి, హరీష్, అయ్యుబ్, యూసుఫ్, వీరు ప్రధాన బాధ్యులుగా ఉండాలని అలాగే వీరికి సహాయకులుగా స్థానిక సభ్యులను నిర్ణయించాలని తీర్మానం చేశారు.

విద్యార్థులకు ప్రగతి పత్రాలు అందజేత

నవతెలంగాణ-వేల్పూర్(ఆర్మూర్)

తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు పచ్చల నడుకుడ ఉన్నత పాఠశాలలో ఆరవ తరగతి నుండి తొమ్మిదవ తరగతి వరకు చదువుకున్న విద్యార్థులకు సోమవారం విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రగతి పత్రాలను అందజేశారు. 244 మంది విద్యార్థులకు ప్రగతి పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ తక్కువ సమయంలో ఉపాధ్యాయులు, కంప్యూటర్ అసిస్టెంట్ ఎంతో శ్రమించి ఆన్లైన్లో రిజల్ట్ ను పొందుపరిచి విద్యార్థులకు ప్రగతి పత్రాలను అందజేశారని తెలిపారు. వారందరినీ ప్రధానోపాధ్యాయులు సురేష్ అభినందించారు.

ఆటో బోల్తా ఇద్దరు మృతి



అంబులెన్సులో క్షతగాత్రులను తరలిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-వర్ని

మండలంలోని బడా పహాడ్ అటవీ ప్రాంతంలో ఆటో బోల్తా పడి ఇద్దరు మృతి చెందారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఆటోలో ఉన్నవారిని బాన్సువాడ పట్టణానికి చెందిన వారిగా గుర్తించారు బాన్సువాడ పట్టణానికి చెందిన మైనార్టీలు బడా పహాడ్ దర్గా వద్దకు వచ్చిన దర్శనం చేసుకుని తిరిగి వెళుతుండగా అటవీ ప్రాంతంలో ఆదివారం అర్ధరాత్రి ఆటో బోల్తా పడింది. ఈప్రమాదంలో హైమద్ది (55) మోహిన్ (45) అక్కడికక్కడే మృతి చెందారు. గాయాల పాలైన కుటుంబ సభ్యులను అంబులెన్స్ ద్వారా నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు.

జడ్పీటీసీని పరామర్శించిన ఎమ్మెల్యే



పరామర్శిస్తున్న బాజిరెడ్డి గోవర్ధన్

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని ఎల్లమ్మ గుట్ట గ్రామంలో జడ్పిటిసి కమల నరేష్ కుటుంబాన్ని రూరల్ ఎమ్మెల్యే ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ సోమవారం పరామర్శించారు. వారంరోజుల్లో తాతయ్య కిషన్ నాయక్, అత్తమ్మ హీరాబాయి కోల్పోయిన నరేష్‌ను ఓదార్చారు. కార్యక్రమంలో ఎంపీపీ లతా కన్నీరం, మంచిప్ప సర్పంచ్ ఇందూరు సిద్దార్థ, బాడ్సి సొసైటీ చైర్మన్, నిమ్మల మోహన్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మొచ్చా శ్రీనివాస్, సిర్పూర్ సర్పంచ్ ముత్యం రెడ్డి, ఎంపీటీసీ రాములు, రైతు విభాగం మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు, పెద్ద రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు

ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని రెంజర్ల గ్రామానికి చెందిన వరదరాజుల గంగాధర్ నివాసం ఉంటున్న గుడిసె ఇటీవల ప్రమాదవశాత్తు కాలిపోయింది. విషయాన్ని తెలుసుకున్న ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి బాధిత కుటుంబానికి రూ.10 వేల రూపాయల తక్షణ ఆర్థిక సహాయాన్ని అందించారు. యువసేన సభ్యులు బాధిత కుటుంబానికి నగదును అందజేశారు. కార్యక్రమంలో సునీల్ యువసేన నాయకులు తదితరులు ఉన్నారు..

విద్యార్థులను సన్మానించిన నలంద యాజమాన్యం



విద్యార్థినిని సన్మానిస్తున్న నలంద యాజమాన్యం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మామిడిపల్లిలోగల నలంద హై స్కూల్‌లో సమ్మెటివ్ అసోసియేట్-2 పరీక్షలో ఈ అకాడమిక్ సంవత్సరంలో నిర్వహించిన అన్ని పరీక్షలలో కలుపుకొని మొదటి మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థిని, విద్యార్థులను తల్లిదండ్రుల సమక్షంలో సన్మాన పత్రంతోపాటు మెడల్స్‌ని బహుకరించినట్టు నలంద యాజమాన్యం ప్రసాద్, సాగర్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ ప్రసాద్ మాట్లాడుతూ వచ్చే నూతన విద్యా సంవత్సరంలో ముందస్తు ప్రణాళిక ప్రకారంగా క్యాలెండర్‌ను రూపొందించి తదనుగుణంగా విద్యార్థుల్ని ఉపాధ్యాయుల్ని ఉత్తేజపరిచే విధంగా భవిష్యత్తు కార్యాచరణ రూపొందించి ప్రణాళిక ప్రకారంగా ముందుకెళ్తామని అన్నారు. ప్రిన్సిపాల్ సాగర్ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం తల్లిదండ్రుల తోడ్పాటుతో సమర్థవంతంగా నిర్వహించామని విద్యార్థుల్ని మును ముందు అన్ని కాంపిటేటివ్ ఎగ్జామ్స్‌లో సమర్థవంతంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఇందుకు తోడ్పడిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యయేతర సిబ్బందిని నలంద యాజమాన్యం అభినందించారు.

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన చైర్మన్



వర్ని :కొనుగోలుకేంద్రం ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్

నవతెలంగాణ-వర్ని/జక్రాన్‌పల్లి

చందూర్ మండలంలోని మేడిపల్లి తండా గ్రామంలో సోమవారం పీఏసీఎస్ చైర్మన్ ప్యారం అశోక్ వరి ధాన్య కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు కేంద్రంలో అమ్ముకొని మద్దతు ధర పొందాలని కోరారు. వాతావరణం చూసి రైతులు దిగులు పడనవసరం లేదని రైతులకు అండగా ఉంటామని తెలిపారు. త్వరగా అందరి రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని రైతులకు ధీమా ఇచ్చారు. దళారులకు అమ్మి నష్టపోవద్దని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ రవి, ఎంపీటీసీ శ్యామ్ రావు, వైస్ చైర్మన్ తారాచంద్, రైతులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: మండలం పుప్పాలపల్లి గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ కుంచాల విమల రాజు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వరి కొనుగోలు కేంద్రానికి నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు2060 బి గ్రేడ్ ధాన్యానికి 2040 మద్దతు ధర లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దావుల పోసాని, ఎంపీటీసీ అంకం లక్ష్మి, గ్రామ రైతుబంధు అధ్యక్షుడు వసంత్ రెడ్డి, గ్రామ సంఘం అధ్యక్షురాలు శ్రీలత, ఏపిఎం రవీందర్ రెడ్డి, కమ్యూనిటీ కోఆర్డినేటర్ బాజన్న, మహిళా గ్రామ సంఘం ప్రతినిధులు, ట్యాబ్ ఆపరేటర్ సాయినాథ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చేపూర్‌లో ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల ప్రత్యేక శిబిరం



శిక్షణలో పాల్గొన్న వాలంటీర్లు

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని చేపూర్ గ్రామంలో సాంఘిక సంక్షేమ మహిళ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల ప్రత్యేక శిబిరం సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఇందూరు సాయన్న, ఎంపీటీసీ బాల నరసయ్య మాట్లాడుతూ ప్రత్యేక శిబిరాన్ని తమ గ్రామంలో ప్రారంభించడం సంతోషకరమైన విషయమని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ధనవేని, వైస్ ప్రిన్సిపాల్ సుమలత, పిడి స్వప్న, వీడీసీ నాగరాజు, యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్, తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడారగంలో రాణించాలి

- పోటీలను ప్రారంభించిన మేయర్
- ఇందూర్ అన్ ఎంప్లాయ్
- అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్
- ప్రీమియర్ లీగ్ నిర్వహణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

యువత క్రీడారంగంలో రాణించాలని ఇప్పటికే ఎంతోమంది క్రీడాకారులు నిజామాబాద్ జిల్లాకు పేరు తెచ్చారని నిజాంబాద్ జిల్లాలో క్రీడాకారులు చాలామంది ఉన్నారని వారిని ప్రోత్సహించేందుకు ఇందూర్ అన్ ఎంప్లాయ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ ప్రీమియర్ లీగ్ నిర్వహించడం అభినందనీయమని నిజామాబాద్ నగర మేయర్ దండు నీతు కిరణ్ శేఖర్ అన్నారు. ఈ సందర్భంగా నిజామాబాద్ నగర మేయర్ దండు నీతూ కిరణ్ శేఖర్ మాట్లాడుతూ.. ఇందూర్ అన్ ఎంప్లాయ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ ప్రీమియర్ లీగ్ మ్యాచ్లు ఏర్పాటు చేయడం ద్వారా ఇతరులకు ఆదర్శంగా నిలుస్తారని క్రికెట్‌నే కాకుండా మిగతా క్రీడల్లో ఇలాంటి మ్యాచ్‌లు పెట్టి వారిని ప్రోత్సహించడానికి నిదర్శనంగా నిలుస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు తార్ల కీర్తి కుమార్, ప్రధాన కార్యదర్శి ధర్మారం ఆవిన్, కోశాధికారి కురువ సతీష్, నగర అధ్యక్షుడు రమేష్ కాంబ్లే, ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ నరేందర్ సింగ్ తర్ల రాజేష్ శోభన్ రూపేష్ రెడ్డి సాయి బండారి శ్రీనివాస్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ సునీత లక్ష్మారెడ్డికి సన్మానం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రానికి వచ్చిన తెలంగాణ రాష్ట్ర మహిళ కమిషన్ చైర్మన్ సునీత లక్ష్మారెడ్డికి నిజామాబాద్ నగర మేయర్ దండు నీతూ కిరణ్ శేఖర్, టీఎస్ సిడబ్ల్యుసి చైర్ పర్సన్ ఆకుల లలిత, మాజీ కార్పొరేటర్లు విశాలని రెడ్డి, సుదం లక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు గంగామణి, బీఆర్ఎస్ మహిళ నాయకులు నిజామాబాద్ నగరంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నగర మేయర్ దండు నీతూ కిరణ్ శేఖర్ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. అనంతరం శాలువతో సత్కరించి బొకే అందించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లాలో విద్యార్థినిలు, మహిళలు పట్ల పలు అంశాలపై చర్చించినట్లు తెలిసింది. నిజాంబాద్ నగరానికి విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ సునీత లక్ష్మారెడ్డి నూడ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి ,విశాలిని రెడ్డి దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ ద్వారా ఎలాంటి అవసరాలు ఉన్న సమాచారం ఇస్తే సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.మహిళా కమిషన్ చైర్ పర్సన్ వాకిటి సునీత లక్ష్మారెడ్డి ని ఎంప్లాయిస్ జేఏసీ పక్షాన నూతన కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం మహిళా ఉద్యోగుల సమస్యలపై ప్రస్తావిస్తూ మహిళా ఉద్యోగుల ప్రసూతి సెలవు పెంపు, ఉద్యోగుల హెల్త్ కార్డు, ఐసీడీఎస్, అంగన్వాడీ, మహిళా ఉద్యోగులు ఇతర సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి రాష్ట్ర ప్రభుత్వానికి తమ నివేదించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినందుకు ఎంప్లాయిస్ జేఏసీ పక్షాన జిల్లా చైర్మన్ అలుక కిషన్, కార్యవర్గ సభ్యులు, ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి నేతి కుంట శేఖర్ పాల్గొన్నారు.



బొకెను అందజేస్తున్న నుడా చైర్మన్ దంపతులు

గల్ఫ్ వలసలపై పరిశోధన చేయడం అభినందనీయం

- డాక్టర్ రవీందర్‌ను సన్మానించిన ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

ఉపాధి కోసం ఎడారి దేశం వెళ్లి, దుర్భర జీవనం వెళ్లదీస్తున్న గల్ఫ్ బాధితులపై తెలంగాణ యూనివర్సిటీ విద్యార్థి పుప్పాల రవీందర్ పరిశోధన చేయడం అభినందనీయమని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్యనగర్ లోగల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పుప్పాల రవీందర్ ఆయనను మర్యాద పూర్వకంగా ఆదివారం కలిశారు. తన పరిశోధన విషయాలను ఎమ్మెల్యేతో పంచుకున్నారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి గోవర్దన్ మాట్లాడుతూ.... సామాజిక బాధ్యతతో కూడిన పరిశోధనలకు, ఎల్లప్పుడు ప్రాధాన్యం ఉంటుందని గుర్తు చేశారు. గల్ఫ్ వలసలపై పుప్పాల రవీందర్ చేసిన పరిశోధన, తెలంగాణ యూనివర్సిటీకే గర్వ కారణమని పొగిడారు. పరిశోధక విద్యార్థి రవీందర్ ఎంచుకున్న తెలంగాణ సాహిత్యంలో గల్ఫ్ వలసల చిత్రాన అనే అంశంలో ఎడారి దేశంలోని తెలంగాణ వలస కూలీల బతుకులను కళ్లకు కట్టారని ప్రశంసించారు. అనంతరం రవీందర్, కనకయ్యలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షులు, జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, నాయకులు మధు, జితేందర్, యూనివర్సిటీ విద్యార్థులు పాల్గొన్నారు



రవీందర్‌ను అభినందిస్తున్న రూరల్ ఎమ్మెల్యే

రైతు బీమా చెక్కు అందజేత

నవతెలంగాణ-ముప్కాల్

ఇటీవల మృతిచెందిన మండలంలోని రెంజర్ల గ్రామానికి చెందిన రైతు మెంచు చిన్న రాజన్న కుటుంబానికి రైతు బీమా చెక్కును సోమవారం సర్పంచ్ ఆకుల రాజారెడ్డి వైస్ ఎంపీపీ ఆకుల చిన్న రాజన్నతో కలిసి అందజేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు కుటుంబాలను ఆదుకునేలా తెచ్చిన సంక్షేమ పథకల్లో ఒకటి 'రైతు భీమా' పాలసీ పథకం ఒకటన్నారు. రూ.5 లక్షల రూపాయల చెక్కును మృతుడి కుటుంబ సభ్యులకు అందజేసినట్టు మండల వ్యవసాయాధికారి రాజ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో రెంజర్ల సొసైటీ చైర్మన్ కె.గంగాధర్, గ్రామ రైతు సమన్వయ సమితి అధ్యక్షులు మహేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ మోహన్ రెడ్డి, ఏఈవో నిశికాంత్ తదితరులు పాల్గొన్నారు..

గర్భిణీలు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

- కంటి వెలుగు ఇన్చార్జి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాజ్‌కుమార్

నవతెలంగాణ-ఎడపల్లి

గర్భిణులు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, గర్భిణీ మహిళలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే పుట్టబోయే బిడ్డలు సురక్షితంగా ఉంటారని ఎడపల్లి కంటి వెలుగు ఇన్చార్జ్ వైద్యాధికారి రాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని దుబ్బ తండా గ్రామంలోని గ్రామపంచాయతీలో గర్భిణీ మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. గర్భిణీ మహిళలు తీసుకోవలసిన ఆహార పదార్థాలపై వివరించారు. ప్రతి నెలకోసారి లేదా పక్షం రోజుకోసారి ఆశ వర్కర్ల సహకారంతో ఎడపల్లి ఆసుపత్రికి వచ్చి వైద్యులను సంప్రదించాలన్నారు. ఆశావర్కర్లు గర్భిణులు, బాలింతలకు, అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. గర్భం దాల్చినప్పటి నుండి బిడ్డ పుట్టేవరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన వివరించారు. ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఏనుగు రాజమణి, మాట్లాడారు. గ్రామంలోని ప్రతి ఇంటిని ఆశ వర్కర్లు సందర్శించి మహిళల ఆరోగ్యం పట్ల అడిగి తెలుసుకోవడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏ కార్యక్రమం నిర్వహించిన అందులో ఆశా వర్కర్లందరూ భాగస్వాములు అవుతున్నామని ఆమె గుర్తు చేశారు. ఎండాకాలంను దృష్టిలో పెట్టుకొని గర్భిణులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె కోరారు కార్యక్రమంలో అనసూయ, దేవమ్మ, అబ్బవ్వ, గంగామణి, భారతి, మాధవి లత, అంగన్వాడి ఉపాధ్యాయురాలు శారద, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

గుండెపోటుతో ప్రొఫెసర్ బాల శ్రీనివాసమూర్తి మృతి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలో తెలుగు విభాగంలో విధులు నిర్వహిస్తున్న ప్రొఫెసర్ బాల శ్రీనివాసమూర్తి సోమవారం గుండెపోటుకు గురై మృతి చెందారు. హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ ప్రొఫెసర్ డి.రవీందర్, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి బాల శ్రీనివాసమూర్తి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ రవిందర్ మాట్లాడుతూ.. తెలంగాణ యూనివర్సిటీలోని తెలుగు విభాగంలో పనిచేస్తున్న డాక్టర్ బాల శ్రీనివాస మూర్తి ఇటీవల ప్రొఫెసర్ గా పదోన్నతి పొందారు. ఈ పదోన్నతిని పాలక మండలి సభ్యులు రద్దు చేశామని ప్రకటించడంతో తీవ్ర మనస్థాపానికి గురైన బాల శ్రీనివాసమూర్తి ఆకస్మికంగా గుండె పోటుకు గురై మృతి చెందాడని తెలిపారు. ఈ సంఘటన చాలా బాధాకరమని అన్నారు. ఆయన వెంట డైరెక్టర్ పిఆర్వో డాక్టర్ జమీల్ అహ్మద్, మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ విద్యా వర్ధిని, ప్రొఫెసర్ కనకయ్య, ప్రవీణ్, త్రివేణి, లావణ్య, కవిత, శిరిష, సత్యనారాయణ, డాక్టర్ రాజారాం ఉన్నారు.



నివాళ్లు అర్పిస్తున్న వీసీ రవీందర్

కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు



కాంగ్రెస్‌లో చేరిన పలువురు

నవతెలంగాణ-సదాశివనగర్

సదాశివనగర్ మండలంలోని అమర్ల బండ, జనగాం గ్రామాల నుండి బీజేపీ, టీఆర్ఎస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరినట్టు నాయకులు తెలిపారు. వీరికి టీపీసీసీ ఉపాధ్యక్షులు మదన్‌మోహన్ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు లింగ గౌడ్, వైస్ ఎంపీపీ గాదరి శ్రీనివాస్ రెడ్డి, ఇర్షాద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎంవైఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, సురేష్ రెడ్డి రాక

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలో మంగళవారం రాష్ట్ర రోడ్లు భవనాలు గృహ నిర్మాణ శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పర్యటిస్తారని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రేగుంట దేవేందర్ తెలిపారు. ఉదయం 10.30 గంటలకు స్థానిక లలిత గార్డెన్ ఫంక్షన్ హాల్ లో జరిగే బాల్కొండ నియోజవర్గ బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధుల సభ ఆత్మీయ సమ్మేళనంలో రాజ్యసభ సభ్యులు కె.ఆర్ సురేష్ రెడ్డి తో కలిసి మంత్రి పాల్గొంటారని తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు హాజరై విజయంతం చేయాలని కోరారు.

హాసకొత్తూర్‌లో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని హాసకొత్తూర్ గ్రామంలో సోమవారం 14వ జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ఏనుగు పద్మ రాజేశ్వర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా బలవంతురాయి మోహత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఏనుగు రాజేశ్వర్, పంచాయతీ కార్యదర్శి నరసయ్య, వార్డు సభ్యులు నోముల సుమలత, కుందారం శ్రావణ్, మహేందర్, శ్రీనివాస్, గ్రామ పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లు అర్పిస్తున్న సర్పంచ్

పార్టీ ప్లీనరి విజయవంతం చేయాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి/వర్ని

గ్రామాల్లో మంగళవారం బీఆర్ఎస్ జెండాలను ఆవిష్కరించి నిజామాబాద్ నగరంలోని బోర్గం సమీపంలో భూమారెడ్డి కళ్యాణ మండపంలో జరిగే పార్టీ ప్లీనరీలో బీఅర్ఎస్ నాయకులు చేరుకోవాలని ప్రజాప్రతినిధులు సోమవారం తెలిపారు. ఇందల్‌వాయి ఎంపిపి బాదవత్ రమేష్ నాయక్, బిఅర్ఎస్ మండల అధ్యక్షులు చిలివెరి గంగాదాస్, సర్పంచ్,ఉప సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షులు లోలం సత్యనారాయణ, రఘునథన్ రాము కోరారు.

వర్ని:తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సహం సందర్భంగా ఈనెల 26న నిర్వహించే బీఆర్ఎస్ పార్టి ప్లీనరీ సమవేశం బాన్సువాడలో జరుగుతుందని ఈ సమావేశానికి వర్ని మండలం నుంచి 700మంది రావాలని మండల అద్యక్షులు గిరి, చందూర్ మండల అద్యక్షులు మూడ్ అంబర్ సింగ్‌లు పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో గులాబీ జెండాలను ఆవిష్కరించి రావాలని ఒక ప్రకటనలో తెలిపారు.

కార్యకర్తను పరామర్శించిన బాజిరెడ్డి

నవతెలంగాణ-మోపాల్

మంచిప గ్రామంలో చింతకుంట సాయి రెడ్డి రెండు నెలల క్రితం జారి పడడంతో కాలు ఫ్రాక్చర్ కాగా ఎమ్మెల్యే ఆర్టీసీ చైర్మన్ బాజీ రెడ్డి గోవర్ధన్ సోమవారం పరామర్శించారు. వారి వెంట మంచిప్ప సర్పంచ్ ఇందూరు సిద్ధార్థ, బీఆర్ఎస్ నాయకులు కన్నీరం, మండల అధ్యక్షుడు మోచ్చా శ్రీనివాస్ తదితర టిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు

అంతక్రియల్లో పాల్గొన్న ఆర్టీసీ చైర్మన్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్



నివాళ్లు అర్పిస్తున్న బాజిరెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఖిల్లా డిచ్‌పల్లి రామాలయ చైర్మన్ పొద్దుటూరి మహేందర్ రెడ్డి తండ్రి ప్రొద్దుటూరి హనుమంత్ రెడ్డి అంత్యక్రియలో ఆర్టీసీ చైర్మన్ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పాల్గొన్నారు. పార్థివదేహానికి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. మాజీ ఎమ్మెల్సీ వి గంగాధర్ గౌడ్ పాల్గొని నివాళులు అర్పించారు. బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అకౌంట్ సెక్షన్ ఆఫీస్‌ను ముట్టడిస్తాం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

అకౌంట్ సెక్షన్ ఆఫీస్‌ను ముట్టడిస్తామని తెలంగాణ యూనివర్సిటీ పిడిఎస్ యూ కమిటీ నాయకులు అన్నారు. సోమవారం యూనివర్సిటీ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ యూనివర్సిటీ అధ్యక్షులు సంతోష్ మాట్లాడుతూ అకౌంట్ సెక్షన్ ఆఫీసర్‌గా ఉన్న భాస్కర్ లక్షల రూపాయలు ఇచ్చి సూపరింటెండెంట్ నుంచి అసిస్టెంట్ రిజిస్టర్‌గా అక్రమ ప్రమోషన్ తీసుకున్నాడని, ఈసి సమావేశం తర్వాత ప్రమోషన్ రద్దు చేశామని చెప్పినా కానీ, ఆయన టేబుల్ మీద అసిస్టెంట్ రిజిస్టర్‌గానే బోర్డు పెట్టుకొని చలామణి అవుతున్నారని తెలిపారు. యూనివర్సిటీకి సంబంధంలేని వ్యక్తులకు యూనివర్సిటీ అకౌంట్ సెక్షన్ నుంచి చెక్కులు ఇచ్చి , యూనివర్సిటీ ఖజానా ఖాళీలో ప్రధాన పాత్ర పోషించాడని అయన అన్నారు.అకౌంట్ సెక్షన్ భాస్కర్ ప్రమోషన్ రద్దు చేయాలని, ఆయన చెక్కుల రూపంలో ఇచ్చిన అమౌంట్ అంతా రికవరీ చేయాలని, ఆయన పైన చర్యలు తీసుకొని ,ఆయనను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శివసాయి, రాజ్‌కుమార్, అస్విత్, మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

ఎస్ఐకి సన్మానం



ఎస్ఐని సన్మానిస్తున్న విశ్వబ్రాహ్మణులు

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రానికి చెందిన విశ్వబ్రామ్మణ సంఘ సభ్యులు సోమవారం నూతన ఎస్ఐ భాస్కరా చారిని మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. నాలుగు రోజుల క్రితం ముప్కాల్ ఎస్ఐగా పదవి బాధ్యతలు చేపట్టడంతో మర్యాదపూర్వకంగా కలిసినట్టు సంఘ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సంఘం పెద్దలు పాల్గొన్నారు.

ఆరుతులాల బంగారు ఆభరణాలు అపహరణ

వివరాలు వెల్లడించిన సిఐ వెంకటనారాయణ

నవతెలంగాణ కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని సుభాష్ నగర్‌లో ఆదివారం జరిగిన చోరిని 24 గంటల్లోనే చేదించినట్లు నిజామాబాద్ నగర సీఐ వెంకటనారాయణ తెలిపారు. సోమవారం 3వ టౌన్ పోలీస్ స్టేసన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. సుభాష్ నగర్ కు చెందిన చింతలపుడి రాధ ఇంట్లో గౌతంనగర్‌కు చెందిన దేవకతే రాజమణి అలియాస్ రాధ ఇటీవల పనిమనిషిగా చేరింది. ఆదివారం ఇంటి పని చేసి సాయంత్రం ఇంటికి వెళ్లిపోయింది. ఇంటి యజమాని రాధ తన బెడ్ రూంలో బంగారు నగల డబ్బాలో ఒక బంగారు నెక్లెస్, బంగారు నల్లపూసల దండ, రెండు జతల బంగారు కమ్మలు కనిపించలేదని తన ఇంట్లో పని చేస్తున్న పనిమనిషిపై అనుమానం ఉందని 3వ టౌన పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై లక్ష్మయ్య కేసు నమోదు చేసుకుని పని మనిషి రాజమణి ఆలియాస్ రాధను అదుపులోకి తీసుకుని విచారించారు. తానే ఆరు తులాల బంగారు ఆభరణాలు చోరి చేసినట్లు ఒప్పుకుందని సిఐ తెలిపారు. రాజమణిని అరెస్టు చేసి రిమాండ్ కు పంపినట్లు తెలిపారు. ఈకేసులో 3వ టౌన్ ఎస్సై లక్ష్మయ్య, ఏఎస్సై రామకృష్ణ, కానిస్టేబుల్ కవితను ఏసీపీ కిరణ్ కుమార్ అభినందించారని సిఐ వెంకటరమణ తెలిపారు.



ముందస్తు వాతావరణ హెచ్చరిక

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్:

రాగల మూడు రోజులు (ఏప్రిల్ 25, 26,27 వ తేదీల్లో నిజామాబాద్ కామారెడ్డి జిల్లాలో పలు చోట్ల ఉరుముల, మెరుపులు, ఈదురు గాలులతో (గంటకి 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో) కూడిన తేలికపాటి నుండి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని ప్రోగ్రాం కోఆర్డినేటర్, కషి విజ్ఞాన కేంద్రం, నిజామాబాద్ వారు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.వడగండ్ల వాన కూడా సంభవించే అవకాశం ఉందని, రైతులు ఎండబెట్టుకుంటున్న వరి ధాన్యం మీద టార్పాలిన్ కవర్లు కప్పుకోవాలని, సురక్షితమైన ప్రదేశంలో నిలువ ఉంచుకోవాలని పేర్కొన్నారు.